జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php








సంపుటి 15 సంచిక 148 విశాఖపట్నం | మంగళవారం 31 జనవరి 2023 | 8 పేజీలు | వెల : 5.00




## వెనుకబడిన వర్గాలు కాదు... వెన్నెముక వర్గాలు

### ముఖ్యమంత్రి వైయస్ జగన్

### మూడేళ్లలో రూ.927 కోట్లు బదిలీ...

### గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా...

పల్నాడు జిల్లా. వినుకొండ .జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి.) : రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న కానుక... జగనన్న చేదోడు.వరుసగా మూడో ఏడాది జగనన్న చేదోడు.రాష్ట్ర వ్యాప్తంగా 3,30,145 మంది అర్హులైన రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు రూ.330.15 కోట్ల ఆర్థిక సాయాన్ని పల్నాడు జిల్లా వినుకొండలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి వైయస్.జగన్. ఈ సందర్భంగా సీఎం వైయస్.జగన్ మాట్లాడుతూ చిక్కటి చిరునవ్వులతో చెరగని ఆప్యాయతలతో ఆత్మీయతలను పంచిపెడుతున్న ప్రతి అక్కకూ, చెల్లెమ్మకూ, ప్రతి అవ్వకూ, తాతకూ, ప్రతి సోదరు డికి, స్నేహితుడుకి ముందుగా మీ బిడ్డ చేతులు జోడించి పేరు, పేరుగా హృదయపూర్వక కృతజ్ఞతలు. వినుకొండలో ఈరోజు దేవుడి దయతో, మీ అందరి చల్లనిదీవెనలతో మరో మంచి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం.

**వెనుకబడిన వర్గాలు కాదు - వెన్నుముక వర్గాలు..**

వెనుకబడిన కులాలు, వర్గాలను వెన్నుముక కులాలుగా మారుస్తామని చెప్పి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ.. ఈ మూడున్నర సంవత్సరాల కాలంలో నవరత్నాల్లోని ప్రతి పథకాన్ని, సంక్షేమ పథకాల్లో ప్రతి పథకాన్నీ ఈ రాష్ట్రంలోని ప్రతి ఒక్క ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద కుటుంబానికి మేలు చేసేలా మనందరి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తూ మేలు చేస్తూ వచ్చింది. ఇచ్చిన మాటను అమలు చేసే విషయంలో భాగంగా ఇవాళ ఇక్కడ సొంత షాపు ఉన్న ప్రతి రజక సోదరుడికి, ప్రతి నాయీ బ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములకు, అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.10వేల ఆర్థిక సాయం చేస్తూ..జగనన్న చేదోడు పథకాన్ని తీసుకువచ్చాం. ఈ మూడున్నర సంవత్సరాల కాలంలో వరుసగా ఇవాళ ఇచ్చే ఈ సహాయంతో మూడో ఏడాది అమలు చేస్తూ... 3.30 లక్షల మందికి మంచి చేస్తూ... రూ.330 కోట్లు బటన్ నొక్కి వాళ్ళ ఖాతాల్లో జమ చేస్తున్నాం.

**మూడేళ్లలో రూ.927 కోట్లు బదిలీ...**

ఈ రోజు ఇస్తున్న రూ.330 కోట్లతో కలుపుకుని ఇప్పటివరకు నా టైలర్ సోదరులు, అక్కచెల్లెమ్మలకు, హెయిల్ సెలూన్లు నడుపుకుంటున్న అన్నదమ్ములకు, అక్కచెల్లెమ్మలకు, ఇస్త్రీ దుకాణాలు పెట్టుకున్న అక్కచెల్లెమ్మలకు మూడేళ్లలలో రూ.927 కోట్లు నేరుగా వారి అకౌంట్లలో బటన్ నొక్కి జమ చేశాం. ఎక్కడా వివక్ష లేని, లంచాలకు తావులేని వ్యవస్థ ద్వారా ఈ సహాయం అంతా పారదర్శకంగా గ్రామ స్థాయిలో అందుతుంది.

## బహుజన రాజ్యాధికారం పార్స్ తోనే సాధ్యం...

### పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితిపార్స్ బాటలో బహుజనులు...

### పది లక్షల సంతకాల సేకరణకు వెల్లువెత్తిన బహుజన నాయకులు, కార్యకర్తలు...



విజయవాడ 30 జనవరి(ప్రజాపాలన ప్రతినిధి): బహుజన రాజ్యాధికారం ఒక్క పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి(పార్స్ )తోనే సాధ్యమని అందుకే బహుజనులు పార్స్ కు బ్రహ్మరథం పడుతున్నారని, పార్స్ చేపట్టిన పది లక్షల సంతకాల సేకరణకు వెల్లువెత్తుతున్న బహుజన అభిమానమే ఇందుకు తార్కాణంగా పార్స్ నాయకులు విశ్లేషిస్తున్నారు. విజయవాడ స్నేహ టీవీ ఛానల్ కార్యాలయంలో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి భవిష్యత్ కార్యాచరణ పై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సును నిర్వహించిన కార్యక్రమంలో పార్స్ నాయకులకు అధినాయకత్వం కొన్ని సూచనలు చేసింది.పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి నియమ నిబంధనలు బహుజనులకు వివరంగా తెలియపరచగలిగాలని,అంతేకాక కుల సంఘాలు కుల సంఘాల్లో పనిచేస్తున్న ప్రజలకు మన నియమ నిబంధనలు వివరంగా తెలవాలి పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితిలో కుల న్యాయం పాటించే విధంగా నియమాలు ఉన్నాయని వివరించగలిగితే సంతకాల సేకరణలో ఇబ్బందులు రాకపోవచ్చున్నారు. షెడ్యూల్ కులాల విషయానికొస్తే సబ్ ప్లాన్ నిధులు 22 వేల కోట్లు రావాలి అవన్నీ ఏ రూపాలలో దారి మళ్లాయో వాటి విషయాలను వివరంగా చెప్పగలిగితే సంతకాల సేకరణ కు షెడ్యూల్ కులాల వారు ముందుండి చేస్తారని,అట్రాసిటీ కేసులను మన ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిపై కూలంకుశంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవచ్చని ఈ విషయాలపై ఎవరైనా అడిగితే వారికి కూడా వివరంగా తెలియపరిచి సంతకాలు చేయించే విధంగా మన ప్రవర్తన ఉండాలని ఆ విధంగా ప్రతి ఒక్కరు నాయకులుగా ఎదగాలి అని నాయకులుగా ఎదిగిన వారిని మొదటగా మన సభ్యులు గుర్తించి గౌరవించాలని అన్నారు. **(మిగతా 2లో..)**

## ఫిబ్రవరి 8న ఏపీ కేబినెట్ సమావేశం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. ఫిబ్రవరి 2వ వారంలో అసెంబ్లీ సమావేశం కానుంది. 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలపై ఆమోదం తెలుపనుంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 8వ తేదీన ఏపీ క్యాబినెట్ సమావేశం జరగనుంది. సీఎం జగన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో బడ్జెట్ కు సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న డ్రోన్ సర్వే, లబ్ధిదారులకు అందాల్సిన పట్టాల పంపిణీ వంటి అంశాలకు ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. వచ్చే సంవత్సరం సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కొనాల్సి ఉన్నందున.. ఈ బడ్జెట్ సమావేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది.



## జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచరుడిపై హత్యాయత్నం

అనంతపురం జిల్లా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, ఐటీడీపీ పట్టణాధ్యక్షుడు గండికోట కార్తీక్ హత్యాయత్నం జరిగింది. హత్యాయత్నం నుంచి ఆయన త్రుటిలో తప్పించుకున్నారు. విధులు ముగించుకుని ఇంటికెళున్న ఆయనపై గత అర్ధరాత్రి కొందరు యువకులు దాడికి పాల్పడ్డారు. కత్తులు, కర్రలతో ఆయనపై దాడి చేశారు. ఈ ఘటనలో కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారు.

## చావనైనా చస్తాగానీ బీజేపీతో మళ్లీ పొత్తు పెట్టుకోను: బీహార్ సీఎం నితీశ్‌కుమార్



పట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ బీజేపీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను చావనైనా చస్తానుగానీ బీజేపీతో మరోసారి పొత్తు పెట్టుకోనని తెగేసి చెప్పారు. బీహార్‌లో మహా కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ చేయని కుట్ర లేదని ఆయన ఆరోపించారు. ఆర్జేడీ అగ్రనేత, బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వియాదవ్‌పైన, ఆయన తండ్రి లాలూప్రసాద్ యాదవ్‌పైన బీజేపీ తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నదని విమర్శించారు.తేజస్విపై, లాలూపై బీజేపీ మోపిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు. ఆర్జేడీని నేతలను వేధించడం ద్వారా కూటమిని విడదీస్తే తాను తిరిగి వాళ్ల దారికి వెళ్తానని బీజేపీ నేతలు భావిస్తున్నారని ఆరోపించారు. నితీశ్ కుమార్‌కు మరో గత్యంతరం లేదని, వచ్చే ఎన్నికల్లో తిరిగి తమతో పొత్తు పెట్టుకుంటారని బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా నితీశ్ పైవిధంగా స్పందించారు.ప్రజాధరణ కోల్పోయిన నితీశ్‌కుమార్ మళ్లీ బీజేపీతో దోస్తీకి ప్రయత్నిస్తారని, అయితే నమ్మద్రోహి అయిన నితీశ్ చేతిలో మరోసారి మోసపోయేందుకు తాము సిద్ధంగా లేమని బీహార్ బీజేపీ అధ్యక్షుడు సంజయ్ జైస్వాల్ వ్యాఖ్యానించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీహార్లో బీజేపీ మొత్తం 40 స్థానాలకుగాను 36 స్థానాల్లో గెలుస్తుందని చెప్పారు.అయితే, లోక్‌సభ ఎన్నికల్లో 36 స్థానాలు గెలుస్తామన్న బీజేపీ నేతల వ్యాఖ్యలపై కూడా నితీశ్ స్పందించారు. జేడీయూతో పొత్తు ఉన్నప్పుడు బీజేపీ ఐడియాలజీని తీవ్రంగా వ్యతిరేకించే ముస్లిం సమాజం కూడా వారికి ఓట్లు వేసిందని, ఈసారి అలా జరగదని చెప్పారు. బీజేపీ అలాంటి ఆశలు పెట్టుకుంటే అడియాశలే అవుతాయని ఎద్దేవా నితీశ్‌కుమార్ చేశారు.

## పాకిస్తాన్‌లో బాంబు పేలుడు : 28 మంది మృతి

పెషావర్ : పాకిస్తాన్ పెషావర్‌లోని మసీదులో బాంబుపేలుడు సంభవించింది. ఈ ఘటనలో 150 మందికి పైగా గాయలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... సోమవారం పాకిస్తాన్‌లోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని మసీదులో బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 28 మంది మృతి చెందగా, 150 మందికి పైగా గాయపడినట్లు లేడీ రీడింగ్ హాస్పిటల్ వైద్యులు వెల్లడించారు. ఈ ఘటన మధ్యాహ్నం ప్రార్థనల కోసం మసీదుకి వెళ్లిన సమయంలోనే బాంబు పేలుడు సంభవించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

## కర్నాటక పోలీసులకు ధన్యవాదాలు తెలిపిన లోకేష్



పలమనేరు (చిత్తూరు జిల్లా): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్ర లో ఏపీ-కర్నాటక సరిహద్దులో ఓ అసక్తికరమైన ఘటన చోటు చేసుకుంది. పాదయాత్రలో కర్నాటక పరిధిలో వచ్చిన రోడ్లపై ఆ రాష్ట్ర పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. సరిహద్దు దాటి తిరిగి ఏపీలోకి అడుగుపెట్టేలోపు లోకేష్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టీడీపీ నేతలు కర్నాటక పోలీసులను అభినందించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ సరిహద్దులో లోకేష్ పాదయాత్రకు కర్నాటక పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. వాళ్లకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. లోకేష్ పాదయాత్రకు కర్నాటక పోలీసులు కల్పించిన భద్రత, వాళ్లు వ్యవహరించిన తీరు అద్భుతమని మరో టీడీపీ నేత అన్నారు. కర్నాటక పోలీసులను చూసి ఆంధ్రా పోలీసులు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.కాగా 4వ రోజు సోమవారం ఉదయం పలమనేరు నియోజకవర్గం నుంచి నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభమైంది. వి.కోటలో పట్టుగూళ్ల రైతులు లోకేష్‌ను కలిశారు. ప్రభుత్వం తమకు సబ్సిడీ ఇవ్వట్లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలపై స్పందించిన లోకేష్.. టీడీపీ అధికారంలోకి రాగానే.. సబ్సిడీ అందిస్తామని హామీ ఇచ్చారు. కాగా ఈరోజు కృష్ణాపురం క్రాస్ వరకు లోకేష్ పాదయాత్ర సాగనుంది. రాత్రికి కృష్ణాపురం టోల్‌గేట్ సమీపంలో ఆయన బస చేస్తారు.




# బహుజన రాజ్యాధికారం పార్స్ తోనే సాధ్యం...

(మొదటిపేజీ తరువాయి)

అంతేకాక ప్రతి నాయకుడు మండల స్థాయి నుండి పార్లమెంటు స్థాయి వరకు నాయకులను నియమించి మీతో కలిసి రాష్ట్ర నాయకులు శక్తి వంచన లేకుండా సంతకాల సేకరణలో పాల్గొనగలిగితే వారి ద్వారా రాబోవు రోజులలో గ్రామస్థాయిలలో కూడా పార్సు నియమ నిబంధనలను బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఆ విధంగా సంతకాల సేకరణను సులభతరం చేయవచ్చన్నారు. ముఖ్యంగా నియమాలలో ఒకటి అయినా ఓసీలకు ఏబిసిడి వర్గీకరణ 15 శాతంగా ఉన్న కాపులకు అంతే శాతం రిజర్వేషన్, ఈ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీ వర్గం స్వతంత్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ముఖ్యమంత్రి పదవి చేపట్టలేదు కనుక పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి అనే ముఖ్యమైన నినాదాన్ని ప్రజల ముందుంచింది. ఒక్కసారి పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో బీసీ అభ్యర్థి ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర ప్రజానీకం మొత్తానికి సమన్యాయం చేయగలిగే తొలి ముఖ్య మంత్రి అవుతారని ఈ రాష్ట్రంలో మీరంతో మీకంతే మేమెంతో మాకంత అనే విధంగా ప్రతి కులానికి రిజర్వేషన్ స్థానంలో ఇప్పటివరకు రాజకీయంగా గాని ఇతరత్రా ఏ విధమైన గుర్తింపు లేని కులాలకు అవకాశాలు కల్పించవచ్చు అన్నారు. ఈ దేశంలో ఒక్క రాష్ట్రంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకునే నిర్ణయాలను బట్టి ఒక్కొక్క విధంగా రిజర్వేషన్లు అమలవుతున్నాయి అని మనం కూడా రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం తెచ్చుకొని వారికి అదేవిధంగా అవకాశాలను గుర్తించి అమలు చేయవచ్చు అని అన్నారు. అందువలన ఈ యొక్క సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఈ సంవత్సరం మార్చి ఆఖరుకల్లా 10 లక్షల మంది నుంచి సంతకాలు సేకరించి పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి (పార్స్ ) తీసుకునే నిర్ణయాలను ప్రజానీకం గౌరవిస్తుందని ఇప్పుడున్న రాజకీయ నాయకులు అందరికీ తెలిసేలా ప్రణాళిక ప్రకారం మన కార్యాచరణ ఉండాలి అని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో జరుగుతున్న విధంగా రాజకీయ నాయకులు రహదారుల వెంట మీటింగులు పెట్టి లక్షల మందిని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అత్తడుగు వర్గాలను తరలించి అనేక చోట్ల బహుజనుల మృతికి కారణం అవుతున్నారని రాజ్యాధికార సమితి అలాంటి వాటన్నిటినీ ఖండిస్తుందని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అలాంటివి జరగకుండా కార్యాచరణ ఉంటుందన్నారు. కరోనా పరిస్థితుల కారణంగా కొన్ని రోజులపాటు వాయిదా పడిన రథయాత్ర కార్యక్రమ విషయమై రథయాత్ర కమిటీ సభ్యులు విచ్చేసిన నాయకులకు వివరించారు.



**పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి సలహా సంఘం నేషనల్ ప్రెసిడెంట్ తట్టి అర్జునరావు మాట్లాడుతూ.....**

డాక్టర్ శివ భాగ్యరావు పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి విషయంలో అన్ని కోణాలలో ఆలోచించి కూలంకషంగా చర్చించి తీసుకునే నిర్ణయాల వల్ల పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఇప్పటికే రాష్ట్రంలోనే కాక దేశంలోని అనేక వర్గాల ప్రజలకు అనేకమంది నాయకుల దృష్టికి వెళ్లిందని అలా వెళ్ళింది అంటే పార్స్ నియమ నిబంధనలు అదేవిధంగా ప్రజా రంజకంగా ఆకర్షణీయంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో ప్రణాళిక లేని విజిటింగ్ కార్డు పార్టీలు, సంఘాలు చాలా ఉన్నాయని, ఇప్పటివరకు ఉన్న పార్టీలు, కుల సంఘాలు గాని మాకు ఇంత ఓటు బ్యాంకు ఉంది అంత ఓటు బ్యాంకు ఉంది అని మేకపోతు గాంబీర్యపు వైఖరితో మాట్లాడుతున్నారే తప్ప ఎవరిలోనూ స్పష్టత లేదని,ఆ పార్టీలలా, సంఘాలలా కాకుండా ఒక ప్రణాళిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఎలా పాలించాలి అనే విషయాలు అన్నీ పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ప్రణాళిక లో ఉన్నాయని, గతంలో అనేక సంఘాలతో తాము చర్చించినా తనకు తానే పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి కి ఆకర్షితుడనయ్యానని నాయకత్వం నిర్ణయించిన సలహా సంఘం చైర్మన్ గా తన ఆలోచనలను పార్స్ తో కలిసి బహుజన రాజ్యాధికారం సాధించే దిశగా నిర్ణయం తీసుకుంటామని అన్నారు. పార్స్ సభ్యులు నాయకులు వేరే వేరే ఓటు బ్యాంకు గురించి ఆలోచించకుండా ఓటు బ్యాంకు లేదనే భయాన్ని విడనాడాలి అని ప్రణాళిక ప్రకారం వెళితే ఓటు బ్యాంకు దానంతట అదే వస్తుంది అని తద్వారా అనుకున్న విజయాలు సాధించవచ్చు అని పార్సులో ఉన్న నాయకులు ఐకమత్యం తో రాజ్యాధికారం దిశగా పయనించాలి అని విజయమో వీర స్వర్గము మనమే నిర్ణయించుకోవాలి అని ఈ సందర్భంగా తట్టి అర్జున్ రావు అన్నారు.

**అనంతరం మాట్లాడిన స్టేట్ కోఆర్డినేటర్ ఏ బలరాం**

బీసీ కులాలలో అగ్రభాగాన ఉన్న నాలుగైదు కులాలు మాత్రమే ఇప్పటివరకు రాజ్యాధికారంలో పాలుపంచుకుంటున్నాయని అలా కాకుండా బిసిలలో ఉన్న ప్రతి కులానికి ప్రాతినిధ్యం ఉండేలా పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ద్వారా రాజ్యాధికారం వచ్చిన తర్వాత ప్రతి కులానికి ప్రాతినిధ్యం ఉండేలా పార్స్ చూస్తుందని బలరాం అన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఉన్న చిన్న చిన్న నాయకులను గుర్తించి వారి ద్వారా సంతకాల సేకరణ జరిపిస్తే అతి తక్కువ కాలంలో అనుకున్న విధంగా విజయాలు సాధించవచ్చని మరి ముఖ్యంగా పార్స్ ఆశయాలను ప్రతి ఒక్క బహుజనులకు అర్థమయ్యేల వివరిస్తే సంతకాల సేకరణ సులువుగా చేయవచ్చు అని ఇబ్బందులు రాకపోవచ్చు అని మరో స్టేట్ కోఆర్డినేటర్ కె రవికుమార్ అభిప్రాయం వెలిబుచ్చారు. సంతకాల సేకరణ విషయంలో వారి పరిధిలో ఉన్న ప్రాంతాలే కాక రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో కూడా సంతకాల సేకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి అని ఆ విధంగా సంతకాల సేకరణను విజయవంతం చేస్తే శివ భాగ్య రావు ఆలోచన విధానాన్ని గౌరవించినట్లు అవుతుంది అని మరో స్టేట్ కోఆర్డినేటర్ ఎం పిచ్చయ్య అన్నారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలో నాయకులని కలుపుకొని ఇంకా నియమించాల్సిన నాయకులను కూడా నియమించి నరసాపురం నియోజకవర్గ పరిధిలో అతి తక్కువ కాలంలోనే లక్ష సంతకాలు సేకరిస్తామని స్టేట్ కోఆర్డినేటర్ డి కె వి ప్రకాష్ అన్నారు. మనకు తెలిసిన బహుజన సంఘాల సభలలో మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు పార్స్ నియమాలను వివరించగలిగితే సభ్యుల ద్వారా సంతకాల సేకరణ సులభతరం అవుతుంది అని పార్స్ స్పోక్స్ పర్సన్ కె ప్రసాదరావు అన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాధికార సమితి పాదయాత్ర కార్యక్రమం అతి త్వరలో ప్రారంభించి మార్గమధ్యలో నాయకులను కలుపుకొని పార్స్ నియమ నిబంధనలను ఆ ప్రదేశాలలో ఉన్న ప్రజలకు వివరిస్తూ కార్యక్రమాన్ని రాష్ట్ర మొత్తం విస్తరించేలా ప్రణాళిక ఏర్పాటు చేస్తున్నామని స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ పి పరమశివన్ అన్నారు. విచ్చేసిన ప్రతి సభ్యులు పార్స్ నియమ నిబంధనలకు లోబడి కార్యక్రమాలు రూపకల్పన చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ బహుజన నాయకుడి సూచనలను పార్స్ గౌరవిస్తుందని, అమలు పరుస్తుందని తెలిపారు.

## విజయవాడ మాస్టర్ కీ ఛానల్ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన పార్స్ నేషనల్ కన్వీనర్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు...



విజయవాడ (ప్రజాపాలన ప్రతినిధి ):విజయవాడ లో మాస్టర్ కీ టివి ఛానల్ కార్యాలయం లో 2023 నూతన సంవత్సర " మాస్టర్ కీ టివి క్యాలెండర్ ను పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి నేషనల్ కన్వీనర్, స్నేహ గ్రూప్ ఆఫ్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ డాక్టర్. కటికల. శివభాగ్యారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ఆయనతో పాటు రిటైర్డ్ జడ్జి రామదాసు,కేంద్ర కమిటీ సభ్యుడు డాక్టర్ కందుల.చందు, ఎ పి . మీడియా ఇంఛార్జి గురజాల.శ్రీనివాస్ రావు,స్టేట్ కోఆర్డినేటర్లు నమ్మి అప్పారావు యాదవ్ , కె రవి కుమార్,డాక్టర్. పి పరమశివం,ఏ బలరాం,ఎన్ సంధ్య, ఎం పిచ్చయ్య ,కె ప్రసాదరావు,డీ కే వి ప్రకాష్ ,పొన్నూరు కంటెంట్ ఓనర్ అమిరిసెట్టీ.రమాదేవి,డాక్టర్ .కె.వరప్రసాద్,ప్రతాప్ , అంబెద్కర్ టివి ఛానల్ రిపోర్టర్స్, పార్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధేయమార్గం ఆచరణీయం. - పేరాల ఏ.ఆర్.ఎం. హైస్కూల్ హెచ్ఎం.బి.సాల్మన్

చీరాల, జనవరి 30, ప్రజాపాలన : గాంధేయ మార్గం ఆచరణీయమని, భారత దేశాన్ని బ్రిటిష్ సామ్రాజ్యపాలన నుంచి, విముక్తి చేసేందుకు, ముందుండి పోరాడిన నాయకుల్లో, గాంధీజీ ఒకరని, పేరాల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి. సాల్మన్ పేర్కొన్నారు. గాంధీ 75 వ వర్ధంతి సందర్భంగా, గాంధీజీ చిత్రపటానికి, పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేత కర్రబట్టి, నూలు వడికి, మురికివాడలు శుభ్రం చేసి, అన్ని మతాలు, కులాలు ఒక్కటే అన్నారని అన్నారు. సత్యం, అహింస అనేవి తన ఆయుధాలను చెప్పి, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారని అన్నారు. బ్రిటిష్ పాలకుల చేతుల్లోంచి, భారతమాతకు విముక్తి కలిగించిన మహోన్నతుడు గాంధీ అని కొనియాడారు. భారతదేశంపై చెరగని ముద్రవేసిన మహనీయుడు గాంధీజీ అని, 1948 జనవరి 30న ఢిల్లీలోని బిర్లా నివాసం వద్ద, ప్రార్ధనా మందిరానికి వెళ్తుండగా, ఆయనను నాథూరామ్ గాడ్సే కాల్చి చంపాడని గుర్తు చేసుకొన్నారు..

## ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాం: బొమ్మిడి నాయకర్



నరసాపురం, జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి) :ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో పోరాటమే లక్ష్యంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా 5వ రోజు సోమవారం నరసాపురం మండలంలోని కొత్త నవరసపురం గ్రామంలో జనసేన పార్టీ రాష్ట్ర పిఏసి సభ్యులు, నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ బొమ్మిడి నాయకర్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రగా ప్రతీ గడపకు వెళ్లి వారికి జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి వారి యొక్క సమస్యలను, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై జనసేన పార్టీ ప్రజల తరపున ప్రభుత్వంతో పోరాడుతుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ గ్రామంలో త్రాగునీటి సమస్య అధికంగా ఉండటంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ గ్రామం లోతట్టు ప్రాంతం కావడం వలన వరదలు సంభవించినప్పుడు గ్రామం మొత్తం నీట మునిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, రోడ్ల దుస్థితి చాలా అధ్వాన్నంగా ఉందని నాయకర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, బందెల రవీంద్ర, గుబ్బల మార్రాజు, గుగ్గిలపు శివరామకృష్ణ, పోలిశెట్టి నళిని, కొట్టు రామాంజనేయులు, బందెల ఎలీషా, అందే దొరబాబు, కోపల్లె శ్రీనివాస్, ఒడుగు ఏసు, గంటా కృష్ణ, బొక్కా స్వామి, మేడిది ప్రవీణ్ కుమార్, ఈదా హేమంత్, కిందాడి హర్ష, పలువురు పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## ఏపీలో అమలవుతున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవు: రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ లో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రంలో లేవని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. సోమవారం 23 వ డివిజన్ 93 వ వార్డు సచివాలయం పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి ఆత్మకూరు సుబ్బారావు, కోఆర్డినేటర్ ఒగ్గు విక్కీతో కలిసి ఆయన పాల్గొన్నారు. కోవెలమూడి వారి వీధి, చలసాని వెంకటకృష్ణయ్య వీధి, రామానాయుడు వీధులలో విస్తృతంగా పర్యటించి 120 ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు స్థానికులు సాదర స్వాగతం పలికారు. పలువురు విదేశాల నుంచి తమ అభిమాన నేతతో వీడియో కాల్ ద్వారా సంభాషించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సుపరిపాలన గూర్చి కీర్తించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని మల్లాది విష్ణు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 12 ప్రధాన రహదారుల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయడంతో ఈ ప్రాంత ముఖచిత్రమే మారిపోయిందన్నారు. మంచి నీటి సదుపాయాన్ని సైతం మెరుగుపర్చినట్లు వెల్లడించారు. ప్రజలకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై ఆరా తీశారు. సైడ్ కాలువలలో ఎప్పటికప్పుడు పూడికను తొలగించాలని వీఎంసీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు చల్లా సుధాకర్, వెన్నం రత్నారావు, కొల్లిపర శ్రీను, పసుమర్తి రాజేష్, ఆత్మకూరి వెంకట అప్పారావు, ఇతర నాయకులు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## టి.బి వ్యాధితో చికిత్స చేయించుకుంటున్న రెండేళ్ల చిన్నారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ,ప్రజాపాలన ప్రతినిధి. :టీబీ వ్యాధితో చికిత్స చేయించుకుంటున్న గుడివాడ పట్టణానికి చెందిన ఓ చిన్నారి కుటుంబానికి ఎమ్మెల్యే కొడాలి నాని 50 వేల ఆర్థిక సహాయం చేశారు. రెండేళ్ల వయసున్న చిన్నారి టీవీ వ్యాధితో బాధపడుతుందని, తమ శక్తి మేరకు పాపకు చికిత్సలు చేయిస్తున్నామని, చిన్నారి కుటుంబ సభ్యులు తమ ఆర్థిక పరిస్థితులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే కొడాలి నాని చిన్నారి ఆరోగ్య వివరాలు తెలుసుకొని, చికిత్సలకు అవసరమైన 50వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేసి తన పెద్ద మనసును చాటుకున్నారు. తాము ప్రభుత్వం నుండి సహాయం చేయాల్సిందిగా ఎమ్మెల్యే కొడాలి నానికు విజ్ఞప్తి చేశామని , ప్రభుత్వ సహాయానికి హామీ ఇవ్వడమే కాక, చికిత్సల నిమిత్తం 50 వేల నగదును అందజేసిన ఎమ్మెల్యే కొడాలి నానికు రుణపడి ఉంటామని చిన్నారి కుటుంబ సభ్యులు అన్నారు....

## యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా గోళ్ళ పవన్



నూజివీడు ప్రజా పాలన ప్రతినిధి:నూజివీడు పట్టణానికి చెందిన గోళ్ళ ఫణి (పవన్) యూత్ కాంగ్రెస్ ఏపీ స్టేట్ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జాతీయ యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ కృష్ణ ఆళ్వార్ నుండి మంగళవారం ఉత్తర్వులు అందాయి. గతంలో పవన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మచిలీపట్నం పార్లమెంట్ ప్రెసిడెంట్ గా యూత్ కాంగ్రెస్ లో విధులు నిర్వర్తించారు. ఈ పదవికి రాష్ట్రస్థాయిలో 35 మంది పోటీ పడగా పవన్ ను పదవి వరించింది. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇంత గొప్ప అవకాశం ఇచ్చిన పార్టీకి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా, యువత విద్యార్థుల సమస్యల పరిష్కారం దిశగా ప్రణాళికా బద్ధంగా ముందడుగు వేస్తానని చెప్పారు. పార్టీకి పూర్వ వైభవం తెచ్చే దిశగా, పెద్దల సూచనలు సలహాల మేరకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. పవన్ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా ఎన్నిక కావడం పట్ల నూజివీడు కాంగ్రెస్ ఇంచార్జ్ బీడీ రవికుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సాగర్, పీసీసీ సెక్రెటరీ విఠల్, పలువురు అభినందించారు. పిన్న వయసులోనే పెద్ద పదవులు, బాధ్యతలతో ముందుకు వెళుతున్న పవన్ మరిన్ని విజయాలు సాధించి, అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షించారు. ప్రపంచాన్ని కరోనా మహమ్మారి వణికించిన తరుణంలో పవన్ చేసిన సేవలు శ్లాఘనీయం అని పలు ప్రజాసంఘాల నేతలు పేర్కొంటున్నారు.

## ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే గ్రంధి



భీమవరం, జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి) :ప్రజారోగ్యవే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ. 80 వేల చెక్కును సోమవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారునికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆనాడు పేదల ఆరోగ్యానికి భద్రత కల్పించేందుకు ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ పథకాన్ని పెడితే నేడు ఆయన కుమారుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ ఆరోగ్యశ్రీ పేరిట దాదాపు 3 వేల 500 వ్యాధులకు పైగా కార్పొరేటర్ ఆసుపత్రిలలో ఉచిత వైద్యం అందించే సదుపాయాన్ని కల్పించడం జరిగిందని అన్నారు. ఈ ఉచిత వైద్య సదుపాయం మన రాష్ట్రంలోని ఎంపిక చేసిన కార్పొరేట్ ఆసుపత్రులతో పాటు ఇతర రాష్ట్రాలలో కూడా ఎంపిక చేసిన కార్పొరేట్ ఆసుపత్రులలో అమలు జరిగే విధంగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీ పథకంలో వర్తించని వ్యాధులకు కూడా ముఖ్యమంత్రి సహాయనిధి కింద నిధులు మంజూరుచేసి వైద్యాన్ని అందిస్తున్నామని అన్నారు. వైద్యాన్ని మరింతగా ప్రజలకు చేరువ చేసేందుకు వైయస్సార్ హెల్త్ క్లినిక్కులను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.

## యలవర్తి విజ్ఞ సత్య వరప్రసాద్ కు ఘన నివాళులు



కోడూరు మండలం లో1977-78 టెన్త్ బ్యాచ్ నరసింహపురం వాస్తవ్యులు యలవర్తి విజ్ఞ సత్య ప్రసాద్ కొన్ని సంవత్సరాలగా కొండపల్లిలో నివాసం ఉంటూ ది 22ప01ు2023 రోజున పరమపదించినారు వారికి అశ్రు నివాళులు అర్పిస్తున్న సహెూద్యాయూ, మిత్రులు, అన్నం యోగానంద ,బడే భవన్ నారాయణ అలా వెంకట రమేష్ ,%ూఎ% రమణ,కంచర్లవల్లి వెంకటకృష్ణ ,చంద్ర దుర్గారావు,కొల్లి వెంకటేశ్వరరావు, పూతబోయిన కృష్ణారావు, మెండు గోపాలరావు, మేడా శ్రీనివాసరావు, వేజెండ్ల సాయిబాబు, డు రామ్మోహనరావు, నివాళులు అర్పించినారు

## గ్రామీణ నివాసాలు వద్దకే కార్పొరేట్ వైద్యం: హాస్పిటల్స్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్



శ్రీకాళహస్తి ప్రజాపాలన ప్రతినిధి : ఎంజిఎం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం అల్లెమడుగు తుఫాన్ సెంటర్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 150 మంది పాల్గొని వారి ఆరోగ్యానికి సంబంధించిన సలహాలు, సూచనలు తెలుసుకున్నారు. ఈ వైద్య శిబిరంలో మందులు కూడా ఉచితంగానే పంపిణీ చేసారు. మల్లెమడుగు గ్రామ ప్రజలు మాట్లాడుతూ మా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన ఎంజిఎం హాస్పిటల్ యాజమాన్యంకు, సిబ్బందికి శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ లోని ప్రతీ ఒక్క సభ్యునికి కృత్ఙతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంజిఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలు ఆరోగ్య శ్రేయస్సు కోరి ఎన్నో ఉచిత కార్యక్రమాలు చేశామని శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ వారితో రాబోయే కాలంలో ఎక్కడైనా ఇలాంటి ఉచిత క్యాంపులు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు విసీ వెంకటయ్య. సభ్యులు మాట్లాడుతూ ఎంజీఎం డైరెక్టర్ మయూర్ సహకారంతో మరెన్నో కార్యక్రమాలు చెయ్యడానికి మా ప్రెస్ క్లబ్ ఎప్పటికి ముందుంటామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఎంజీఎం హాస్పిటల్ డాక్టర్ లు, సిబ్బంది. ప్రెస్ క్లబ్ సభ్యులు విశాలాంధ్ర రిపోర్టర్ వెంకట్ కిషోర్ పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా బొల్లినేనిజగన్నాథం నాయుడు



(శ్రీకాళహస్తి ప్రజాపాలన ప్రతినిధి): ప్రముఖ సీనియర్ రాజకీయ నాయకులు, నిగర్వి నిరాడంబరుడు, అజాతశత్రువు, కులాలకు అతీతం, కలిసి ఉండే మనస్తత్వం, అన్నా అంటే పలికే స్వభావం, గర్వం లేని వ్యక్తిత్వం, చెయ్యి సాపితే సహాయం చేసే గుణం, కల్మషం లేని మనిషి , పేద వాడి కోసం పరితపించే నైజం, మనకు 24 గంటలు అందుబాటులో ఉండే నాయకుడు కావాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు, అలాంటి వ్యక్తి అసలు సిసలైన ఎమ్మెల్యేఅభ్యర్థిగా శ్రీ కాళహస్తినియోజకవర్గానికి, 2024లో పోటీ చేస్తున్న శ్రీ బుల్లినేని జగన్నాథం నాయుడుని ప్రజలు తన రాకను ఆనందంతో ఆప్యాయత్తో స్వాగతం పలుకుతున్న పొంగూరు ప్రజలు, ఆ ఊరు ఈ ఊరు అని కాకుండా బొల్లినేని ఎమ్మెల్యేఅభ్యర్థిగా, నాలుగు మండలాల గ్రామీణ ప్రజలు పట్టణ ప్రజలు, అనుచరులు మిత్రులు, ముఖ్యంగా బడుగు బలహీన , మైనారిటీ వర్గాల అభ్యున్నతకై మా అభివృద్ధికై నిరంతరం, మాతోనే ఉంటాడని మా పట్ల మా సమస్యల పట్ల, నిరంతరాయంగా ఇలాంటి వ్యక్తి అయితే మన కష్టాలు పోతాయి,మన అభివృద్ధి జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ ఆలోచనతో ప్రతి పల్లెల్లో జై కొట్టడం కోసం, వేచి ఉన్నారని, సమాచారం, శ్రీకాళహస్తి నియోజకవర్గం రాష్ట్ర రాజకీయానికి ఒక మార్గం, ఇక్కడ ప్రజలు మంచి చేసే నాయకుడికి పట్టం కడతారు, గతంలో బొజ్జల గోపాల కృష్ణారెడ్డి నీ చూశారు, ప్రస్తుతం ఎమ్మెల్యేని చూస్తున్నారు, కానీ ప్రజల్లో ఎక్కడో ఒక నిరాశ, కొత్త వ్యక్తి అయితే బాగుంటుందని ఒక ఆశ, ఈ సమయంలో బొల్లినేని జగన్నాథంనాయుడు, అభ్యర్థిగా ప్రకటించ కోవడం, గ్రామాలలో ఇతను పర్యటిస్తుంటే ప్రజలు తండోపతండాలుగా వచ్చి స్వాగతం పలకడం, మాకు పార్టీలు ముఖ్యం కాదు, ఇలాంటి వ్యక్తులే మాకు కావాల్సింది అని పూలతో స్వాగతం పలకడం జరిగింది, శ్రీకాళహస్తి నియోజకవర్గం లో రానున్న 24 లో త్రిముఖ పోటీ తప్పదని విశ్లేషకుల భావన,

## నూతన డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన



గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం సాయంత్రం 51 వ డివిజన్ పరిధిలోని శ్రీ నగర్ 5, 6.వ లైన్లో నూతన డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి సుమారు 23 లక్షల వ్యయం గల పనులకు గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ముస్తఫా శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నగరంలో రోడ్లు డ్రైనేజీలు నిర్మాణాలు జరుగుతున్నాయని ప్రజలకు ఎలాంటి మురికినీటి సమస్య లేకుండా కొత్త టైంలో నిర్మాణం చేపట్టడం జరుగుతుందని వారు సందర్భంగా అన్నారు . ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి ఇంచార్జ్ చెన్నుపాటి వెంకటరమణ, చెన్నుపాటి శ్రీనివాస్, ఒగ్గ శ్రీనివాసరావు, హైదర్ , హుస్సేన్ , వెంకట్రావు , రాజా , కేసరి వెంకట సుబ్బులు , కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరొకసారి



గుంటూరు నగరంలోని 12వ డివిజన్లోని లాలాపేట పట్నం బజార్ ఆయా ప్రాంతాల్లో తూర్పు స్థానిక శాసనసభ్యులు ముస్తఫా పర్యటించి డ్రైనేజీ సమస్యలను అక్కడ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతాల్లో మురుగు కాలువలు, కల్వర్టులు , పాడైపోయి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న మురుగు కాలువలు గుర్తించి కొత్తవి నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాజా మొహిద్దిన్ చిట్టి హరి మహేష్ తదితరు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీజీ వర్ధంతి వేడుకలు



కాకినాడ: భారతదేశానికి స్వతంత్రం తీసుకురావడంతో రావటంలో మహాత్మా గాంధీజీ ప్రముఖపాత్ర పోషించారని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటి సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయ్ కుమార్ పేర్కొన్నారు. కాకినాడ ప్రజా పాలన ప్రతినిధి ప్రభుత్వ ఆసుపత్రిలో గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ దేశాన్ని ఒక్కతాటి పైకి తీసుకువచ్చి స్వాతంత్ర సంగ్రామంలో అందరినీ భాగస్వాములను చేశారన్నారు. జేఏసి మాజీ నాయకులు బూరిగ ఆశీర్వాదం మాట్లాడుతూ దేశ నాయకులను స్మరించుకునే విధంగా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ప్రతి ఉద్యోగి కూడా తన శాలరీలో నుంచి 500 రూపాయల నుంచి తీసి మన గాంధీజి విగ్రహాన్ని బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పామన్నారు. ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలో సిబ్బంది ప్రతి రోగికి సేవలు అందించి జనరల్ ఆస్పత్రికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నామనారు. ఈ కార్యక్రమంలో ఏపి ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుధారాణి, గ్రేడ్ 2 సూపరింటెండెంట్ అన్నపూర్ణ . హెల్త్ ఇన్స్పెక్టర్ సువర్ణ రాజు, సార్జంట్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుడు సత్తా చాటే సమయం ఆసన్నమైంది!

**సమయం లేదు మిత్రమా రండి కలిసి రండి: పప్పూరి అశోక్ పిలుపు**



జి.కొండూరు:జనవరి 30:(ప్రజాపాలన ప్రతి నిధి):సమాజంలో "మార్పు కోసం"ఒక సామాన్యుడే మొదట అడుగు వేస్తాడు.ఆ ఒక్క అడుగే క్రమాపి 100 అడుగులుగా మారి, ఉవ్వెత్తిన ఎగిసి,మార్పు జరగడానికి దోహదపడతాయి.అలాగే నేడు సమాజంలో నిర్వీరం అయిపోతున్న యువతను,ఐక్యత పరిచేటందుకు నిరుద్యోగ యువతను,వేలు కొల్పేటందుకు,సమాజంలో పాలకుల్లో మార్పు తెచ్చేటందుకు మనలో ఒకడుగా ఉంటూ, సామాన్య కుటుంబం నుండి వచ్చిన ఎమ్మెల్సీ పట్టపద్రుడైన పప్పురి అశోక్ గణతంత్రం దినోత్సవం నాడు"మనలో ఒకడు"అనే కొత్త రాజకీయ పార్టీని పెట్టి,పత్రిక ముఖంగా ప్రకటించడం పై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా మండల కేంద్రమైన జి.కొండూరులో సోమవారం మనలో ఒకడు పార్టీ వ్యవస్థాపకులు,పార్టీ అధినేత పప్పూరి అశోక్ పత్రికా ముఖంగా మాట్లాడుతూ, ఒకప్పుడు చైనా మన దేశం కంటే జనాభా ఎక్కువ కలిగి ఉండేదని,అలాగే యువత కూడా అత్యధికంగా ఉండేవారని,కానీ నేడు భారతదేశ జనాభానే ఎక్కువ అన్నారు.అలాగే యువత కూడా అత్యధికంగా భారతదేశంలోనే ఉన్నారన్నారు.యువత తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చు అన్నారు.కానీ మన దేశ పాలకులు యువతను మతాలవారీగా-కులాల వారీగా విభజన చేస్తూ,యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా,యువతను పాలకుల నిర్వీరం చేస్తున్నారన్నారు.ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ,యువత ఆలోచన చేసేటందుకు వీలు లేకుండా యువత మైండ్ ను క్రికెట్ మీద,క్రీడా రంగాల మీద,సినిమాల మీద మనసును మళ్లిస్తూ,మద్యం కి యువతను బానిసలుగా చేస్తూ,యువత నోటిని పాలకులు కట్టడి చేస్తున్నారని అశోక్ ఆవేదన చెందారు.యువత గురించి,యువత సమస్యల గురించి పార్లమెంట్ లో మాట్లాడే పార్లమెంట్ సభ్యులే కరువైనారన్నారు.అందుకే యువతను మేలు కొల్పేటందుకు పాలకుల్లో మార్పు తెచ్చేటందుకు,యువతను ఐక్యత పరిచేటందుకు మనలో ఒకడు అనే రాజకీయ పార్టీని స్థాపించడం జరిగిందని,పప్పూరి అశోక్ తెలిపారు.ఇప్పటికే విజయవాడ పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో యువతను కలవడం జరిగిందన్నారు.రానున్న ఎన్నికల్లో విజయవాడ పార్లమెంట్ స్థానం నుండి మనలో ఒకడు పార్టీ నుండి తను పోటీ చేస్తున్నట్లు పప్పూరి అశోక్ తెలిపారు.మనలో ఒకడు రాజకీయ పార్టీ దిన-దిన అభివృద్ధి చెందాలని ఆశిద్దాం!

## జాతిపితకు ఘన నివాళి అర్పించిన ఆర్డిఓ రవీందర రావు



నందిగామ జనవరి 30 ప్రజాపాలన ప్రతినిధి: జాతి పిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఆర్డిఓ రవీందర రావు ఆయనకు ఘన నివాళి అర్పించారు ఈ కార్య క్రమంలో భాగంగా జాతిపిత చిత్రపటానికి పూలమా లలు వేసి అంజలి ఘటించారు ఈ కార్యక్రమంలో తా సిల్దార్ నరసింహారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు

## కోడూరు మండలంలో మహాత్మా గాంధీ కి ఘన నివాళి..!



కోడూరు: మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా కోడూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వెన్నా షైనీ ఆధ్వర్యంలోగాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు..ఈ కార్యక్రమంలో జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు పరిశే మాధవరావు, ఉప సర్పంచ్ ఇంకొల్లు మురళి, రైతు సంఘం నాయకులు ఆవులు బసవయ్య, రేపల్లె రాము, వెన్నా ప్రసాద్, బండే నాగరాజు, సచివాలయ కన్వీనర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ అవార్డులపై ప్రాజెక్టు చేసిన విద్యార్థి రేవంత్ కుమార్

**మంచి ఫీడ్ బ్యాక్ ఇచ్చావంటు విద్యార్థికి అభినందనలు**



రాజమహేంద్రవరం, ప్రజాపాలన ప్రతినిధి: శ్రీచైతన్య స్కూల్ (సివిల్ బ్యాచ్) తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం.రేవంత్ కుమార్ పద్మశ్రీ అవార్డులపై ప్రాజెక్టు వర్క్ చేసి అభినందనలు అందుకున్నాడు. సంక్రాంతి సెలవుల్లో స్కూలు వారు ఇచ్చిన పద్మ అవార్డుల అంశంపై ప్రాజెక్టు వర్క్ ను పూర్తి చేసి ప్రకాశంనగర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ రాజుకు చూపించాడు రేవంత కుమార్.ప్రాజెక్టు వర్కును పరిశీలించిన ఎస్.ఐ. ప్రేమ్ రాజు మాట్లాడుతూ పద్మ అవార్డులపై మంచి ఫీడ్ బ్యాక్ ఇచ్చావని రేవంత్ కుమార్ ను అభినందించి కీపీటప్ అన్నారు.భవిష్యత్ లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని విద్యార్థికి ఆశీస్సులు అందచేశారు. పాఠశాల నిర్వాహకులు కూడా రేవంత్ ను అభినందించారు.పద్మ అవార్డులపై అద్భుతంగా ప్రాజెక్టు వర్క్ చేసిన రేవంత్ కుమార్ తలిదండ్రులు ముమ్మిడివరపు శ్రీనివాస్,అంబికలను కూడా పలువురు బంధువులు, స్నేహితులు అభినందించారు.

## దీవెన ఫౌండేషన్ వారు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నబాబు కు ఆర్థిక సహాయం



ప్రజాపాలన ప్రతినిధి:విజయవాడ వైయస్సార్ కాలనీ కి చెందిన మూడు నెలల బాబు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తల్లిదండ్రులు నవ్వుడు ప్రీతి రాంబాబు దీవెన ఫౌండేషన్ వారి దృష్టికి తీసుకురాగా ఈరోజు దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ వారి తరపున బాబు హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయలు ఆర్థిక సహాయంగా బాబు తల్లిదండ్రులకు అందజేయడం జరిగింది. మాచవరం హెడ్ కానిస్టేబుల్ బాబురావు ఉమెన్ కానిస్టేబుల్ జ్యోతి సింగినగర్ కానిస్టేబుల్ రాజేష్ హాస్పిటల్ కి వెళ్లి బాబు తల్లిదండ్రులకు పదివేల రూపాయలు అందజేయడం జరిగింది పేదవారికి ఆపదలో ఉన్నవారికి సహాయం చేస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యుల కు బాబు తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలపడం జరిగింది.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 31, జనవరి 2023

## 8 ఏండ్లలో రూ.12 లక్షల కోట్లు మాయం!

కేంద్ర ఆర్థికమంత్రి అందజేసిన సమాచారం ప్రకారం.. 2014-15 నుంచి 2021-22 వరకు మొత్తం నిరర్థక ఆస్తులు రూ.66.5 లక్షల కోట్లు. వీటిలోంచి రూ.14.5 లక్షల కోట్లను రద్దు చేశారు. వీటిలో ఎంత గరిష్ఠంగా వసూలు చేసినా రూ.2.8 లక్షల కోట్లకు మించి రాదు. మిగిలిన రూ.12 లక్షల కోట్లు శాశ్వతంగా నష్టపోయినట్లే. ప్రజల సొమ్మును ప్రభుత్వ అనుకూల కార్పొరేట్లు దోచుకునే ఈ విధానానికి అంతమెప్పుడు? నరేంద్రమోదీ ఎనిమిదేండ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు మాఫీ చేశాయి. ఈ రుణాలు ము ఖ్యంగా భారీ కార్పొరేట్ కంపెనీలు తీసుకున్నవే. ఇదంతా 'చట్టబద్ధంగానే' జరిగింది. ఎ లాగంటే, పరిశ్రమల స్థాపన పేరుతో రుణాలు తీసుకోవటం ఆ తర్వాత వాటిని నిరర్థక ఆస్తులుగా (ఎన్‌పీఏలుగా) ప్రకటించటం. రుణాల ను మాఫీ చేయించుకోవటం. భారత్‌లో ఎన్‌పీఏలు అంతర్జాతీయంగా అంగీకరించిన ప్రమాణాల కన్నా 4-6 రెట్లు అధికంగా ఉంటున్నా యి. ఇంత భారీస్థాయి వ్యవహారం రాజకీయ మద్దతు లేకుండా జరిగే అవకాశమే లేదు. ఎవరైనా ఒకరిద్దరు జైలులో ఉన్నారంటే, వారికి రాజకీయ బాసుల రక్షణ లేకపోవటం వల్లేనని మనం భావించవచ్చు. ఎన్‌పీఏలు అన్నీ కూడా కావాలని తయారైనవి కావన్నది వాస్తవం. అందుకనే, మొత్తం రుణాల్లో 1-2 శాతం ఎన్‌పీఏలుగా మారే అవకాశం ఉందని అంతర్జాతీయంగానే అంగీకరించిన విషయం. వీటిలో సగం (0.5-1 శాతం) వరకు రుణాలు రద్దు చేయబడతాయి కూడా. ఐఎంఎఫ్-2021 నివేదిక ప్రకారం మొత్తం రుణాల్లో ఎన్‌పీఏల నిష్పత్తి అమెరికాలో, బ్రిటన్‌లో దాదాపు ఒక శాతం. కెనడాలో 0.4 శాతం, దక్షిణ కొరియాలో 0.2 శాతం, స్విట్జర్లాండ్‌లో 0.7 శాతం ఉంది. ఆర్థిక అక్రమాలపై అత్యంత కఠినంగా వ్యవహరించటం వల్లే ఈ దేశాల్లో పరిస్థితులు ఇంత మెరుగ్గా ఉన్నాయి. ప్రజాధనాన్ని, వనరుల్ని ఇష్టారీతిన దోచుకునే క్రోనీ క్యాపిటలిస్టులు ఉన్న రష్యాలో ఈ నిష్పత్తి 8.3 శాతం ఉంది. మోదీ పాలనలో ఉన్న భారత్ కూడా రష్యాకు ఏమీ తీసిపోవటం లేదు. కానీ, దీనిపై ప్రధాన స్రవంతి మీడియా ఎన్నడూ నోరు మెదపటం లేదు. గతేడాది డిసెంబరు 13న రాజ్యసభలో ఆర్థికమంత్రి నా ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'అన్ని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల రుణాలు, నిరర్థక ఆస్తుల నిష్పత్తి 31 మార్చి 2014న 4.1 శాతం ఉండగా, 31 మార్చి 2018న అది 11.46 శాతానికి పెరిగింది' అని తెలిపారు. ఆర్థికశాఖ సహాయమంత్రి మరింత వివరంగా.. గత ఏడేండ్లలో గరిష్ఠం 12.17 శాతానికి చేరిందని వెల్లడించారు. అయితే, గతేడాది మార్చి 31కి ఇది తగ్గి 5.9 శాతానికి, సెప్టెంబరుకు 6.5 శాతానికి పెరిగింది. దీనిపై ఆర్థిక మంత్రి ప్రభు త్వ చర్యల కారణంగానే ఇది సాధ్యమైందని చెప్పుకొచ్చారు. కానీ, అదంతా వట్టిదేనని గతేడాది డిసెంబరు 29న విడుదలైన ఆర్బీఐ నివేదిక స్పష్టం చేసింది. 2023 సెప్టెంబరుకు ప్రభుత్వరంగ బ్యాంకుల ఎన్‌పీఏలు 9.4 శాతానికి, ప్రైవేటు బ్యాంకుల ఎన్‌పీఏలు 5.8 శాతానికి చేరుకోవచ్చని అంచనా వేసింది. ఈ పరిస్థితిని బ్యాలెన్స్ చేసుకోవటానికి లా భాలను ఆర్జించే ప్రభుత్వరంగ బ్యాంకుల (పీఎస్‌బీ) చేత నష్టాలు వస్తున్నట్లుగా చూపిస్తున్నది ప్రభుత్వం. యూపీఏ-2 హయాంలో పీఎస్‌బీలు ఏటా రూ.35 వేల కోట్ల నుంచి రూ.50 వేల కోట్ల లాభాలు ఆర్జించాయి. అవే బ్యాంకులు మోదీ పాలన మొదలైన నాలుగేండ్లలోనే (2015-16 నుంచి 2019-20) రూ.2 లక్షల కోట్ల నష్టాలు చవిచూశాయి. ఎన్‌పీఏలను భరించటం వల్లనే వీటికి ఈ నష్టాలు. రాజ్యసభలో ఆర్థికమంత్రి ఇచ్చిన సమాధానం ప్రకారం.. 2014 నుంచి 2018కి ఎన్‌పీఏలు రూ.2.51 లక్షల కోట్ల నుంచి 9.63 లక్షల కోట్ల కు పెరిగాయి. నాలుగేండ్లలో నాలుగు రెట్ల పెరుగుదల. ఈ డబ్బంతా ఎటు పోతోందని నిలదీ స్తూ బ్యాంకు ఉ ద్యోగుల సంఘాలు రోడ్డెక్కా యి. ఈ స్థాయిలో ఎన్‌పీఏలను, రుణాల రద్దు ను మనదేశం గతంలో ఎప్పుడూ చూడలేదు. ఎన్‌పీఏల కోసం రూ.1.93 లక్షల కోట్లను కేటాయించిన యూపీఏ-2 హయాంలోనే ఈ సమస్య మొదలై ఉండవచ్చు. కానీ, నాడు ఎన్‌పీఏల నిష్పత్తి 3-4 శాతానికి మించలేదు. ఆ తర్వాతే పరిస్థితి విషమించింది. ఎన్‌పీఏల కోసం రూ.10.16 లక్షల కోట్ల భారీ మొత్తాన్ని కేటాయించటం జరిగింది. విచిత్రమేమిటంటే, మన్మోహన్ పదేండ్ల హయాంలో ఈడీ 112సార్లు సోదాలు జరిపితే, మోదీ ఎనిమిదేండ్ల పాలనలోనే దానికి 27 రెట్లు సోదాలు పెరిగాయి. అయినప్పటికీ, ఎన్‌పీఏలు తగ్గలేదు సరికదా.. విపరీతంగా పెరిగాయి. దీనికి ప్రధాన కారణం.. మోదీతో, బీజేపీతో సన్నిహిత సంబంధాలున్న కార్పొరేట్లే. నీరవ్‌మోదీ, మెహుల్ చోక్సీ వంటి వాళ్లకు అప్పులివ్వక తప్పని పరిస్థితిని ఎదుర్కొన్న బ్యాంకులు ఎలా దివాళా తీశాయో ఇప్పటి వరకూ బయటకు రాలేదు. రూ.లక్ష కోట్ల మేర అప్పు చేసి చేతులెత్తేసిన అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూపు కంపెనీల వ్యవహారంపై కూడా నిశ్శబ్దమే కొనసాగుతున్నది.

మన్మోహన్ రెండో దఫాలో జీడీపీ లో కార్పొరేట్ పన్నుల వాటా 3.34 శాతానికి చేరుకుంటే, మోదీ రెండో దఫాలో అది 2.3 శాతానికి పడిపోయింది. ఈ భారాన్ని క్రూరమైన జీఎస్టీ, కేంద్ర పన్నులు, సుంకాలు, వ్యక్తిగత ఆదాయపన్నుల రూపంలో సామాన్య పౌరులు మోశారు. జీడీపీలో ఒక్క శాతాన్ని మోదీ ఈ విధంగా కార్పొరేట్లకు బహుమతిగా ఇచ్చారు. ప్రతిగా వారి నుంచి మోదీకి, బీజేపీకి కచ్చితంగా ప్రత్యుపకారం జరిగే ఉండవచ్చు. ఆ పార్టీ నిధుల ప్రవాహంతో అజేయంగా క నిపిస్తున్నదంటే దానంతట అదే జరగదు. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల (ప్రభుత్వరంగ, ప్రైవేటు, విదేశీ బ్యాంకుల) మొత్తం నిరర్థక ఆస్తులు 2014-15 నుంచి 2021-22 మధ్య కాలంలో రూ.66.5 లక్షల కోట్లుగా పేరుకుపోయాయి. ఇది పార్లమెంటులో ఆర్థికమంత్రి చెప్పిన వివరాల ఆధారంగా వేసిన లెక్కనే. అయితే, ఈ ఎనిమిదేండ్ల కాలవ్యవధిలో ఎన్‌పీఏల్లో ఎంత మాఫీ చేశారన్నదానిపై స్పష్టత లేదు. పాత గణాంకాల ప్రకారం చూస్తే ఇది రూ.14.5 లక్షల కోట్లు ఉంటుంది. ఎన్‌పీఏలను రద్దు చేసినప్పటికీ.. కొంత మొత్తాన్ని వేలం ద్వారా, ఇతరత్రా ఎగవేతదారుల నుంచి రాబట్టటానికి అవకాశం ఉంది. ఆర్థికమంత్రి చెప్పిన ప్రకారమే.. 13 శాతం వరకు రాబట్టవచ్చు. దీనిని మరింత పెంచి 20 శాతంగా తీసుకున్నా.. మొత్తం రూ.14.5 లక్షల కోట్లలో రూ.2.8 లక్షల కోట్లు మాత్రమే ఏనాటికైనా వసూలయ్యే అవకాశం ఉంది. అంటే, దాదాపు రూ.12 లక్షల కోట్లు శాశ్వతంగా దేశం నష్టపోయినట్లే. ఈ డబ్బు మనవంటి సాధారణ డిపాజిట్‌దారులు, చిన్నస్థాయి ఇన్వెస్టర్లదే. బోఫోర్స్ కుంభకోణం విలువ రూ.64 కోట్లు. కానీ, ఇక్కడ రూ.12 లక్షల కోట్ల కుంభకోణం జరిగింది. చిన్న చిన్న ఆర్థిక నేరాలపై క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నప్పుడు.. ఈ భారీ నేరాలపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారు.

# మందుల కంపెనీలు - నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణ



గాంబియాలో 66 మంది పిల్లలకు మూత్రపిండాలు పాడై చనిపోయారు. దీనికి కారణం హర్యానా లోని 'మైడెన్ ఫార్మా' మందుల కంపెనీ తయారు చేసిన దగ్గు మందు. ఇందులోని డై ఇథలైన్ గ్లైకాల్, ఇథలిన్ గ్లైకాల్ అనే మందులు కలుషితం కావడంతో వీరు చనిపోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. ఈ విషయం సభ్య సమాజాన్ని కకావికలం చేసింది. హృదయ విదారకమైన ఈ సంఘటన ప్రపంచాన్ని కలచివేసింది. అదేగాక ఇండోనేషియాలో కూడా ఈ తరహా సంఘటన జరిగిందని వార్తలొచ్చాయి. మందులు కలుషితం కావడం, మోతాదుకు మించి ఉపయోగించడం, సరైన ప్రామాణికాలు పాటించకపోవడంతో ఈ ఘటనలు జరిగాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. ఈ దారుణాన్ని మర్చిపోకముందే ఉత్తరప్రదేశ్‌కు చెందిన మారియన్ బయోటిక్ ఫార్మా కంపెనీ తయారుచేసిన డాక్‌వన్ మ్యాక్స్ అనే కాఫ్ సిరప్ తాగడంతో గత డిసెంబరులో ఉజ్బెకిస్తాన్‌లో 18 మంది చనిపోయినట్లు వెలుగు లోకి వచ్చింది. దీంతో మందుల కంపెనీల ఎగుమతుల్లో భారత్ ప్రతిష్ట మసకబారేలా వుంది.

మన దేశంలోనూ అనేక ప్రాంతాల్లో ఈ తరహా సంఘటనలు చోటుచేసుకున్నాయి. కొద్ది సంవత్సరాల క్రితం విశాఖపట్నంలో మధుమేహ వ్యాధిగ్రస్తుడు రోజూ ఇన్సులిన్ తీసుకుంటున్నప్పటికీ, సుగర్ వ్యాధి నియంత్రణ లోకి రాలేదు. దాంతో వైద్యుడు అనుమానంతో ఇన్సులిన్ వైల్‌ను పరీక్షకు పంపించగా నిర్ఘాంతపోయే వాస్తవం బైటపడింది. వైల్‌లో ఇన్సులిన్ మందు బదులు డిస్టిల్ వాటర్ వున్నట్లు గుర్తించి దిగ్భ్రాంతి చెందారు. ఔషధ నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ కంపెనీపై చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. ఇటువంటి ఘటనలు అనేకం వున్నాయి. 1986లో దేశ ఆర్థిక రాజధాని ముంబయి లోని జెజె ఆస్పత్రిలో చోటుచేసుకున్న 14 మరణాలు దేశ ప్రజలను కలచివేశాయి. 10 నుంచి 76 ఏళ్ల వయసు కల్గిన ఈ 14 మంది మూత్రపిండాలు దెబ్బతిని చనిపోయారు. ప్రజలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో ఈ మరణాలపై ప్రభుత్వం కమిషన్‌ను నియమించాల్సి వచ్చింది. ఈ దుర్ఘటనపై ముంబాయి హైకోర్టు జడ్జి భక్తావర్ లెంటిన్‌తో స్వతంత కమిషన్‌కు ప్రభుత్వం ఆదేశించింది. వివిధ స్థాయి అధికారులు ఈ కంపెనీ అవకతవకల్లో భాగస్వాములైనట్లు కమిషన్ గుర్తించింది. డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్ట్‌ను సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించింది. మందుల షాపులు, ఔషధ కంపెనీల్లోని లోపాల్ని ఎత్తిచూపింది. ముంబయి జనాభా అవసరాలకు మించి మందుల షాపులున్నట్లు తేల్చింది. ఈ సంఘటనతో అన్ని పార్శ్వాలను లెంటిన్ అధ్యయనం చేసి మందుల తయారీ నుంచి అమ్మకాల వరకు నియంత్రణ, పర్యవేక్షణ లోపాలపై ప్రభుత్వానికి స్పష్టమైన నివేదిక ఇచ్చారు. ఈ తరహా ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించారు.

మందుల్లో 35 శాతం వరకు నాసిరకం, నకిలీ మందులు చలామణిలో వున్నాయని...2004లో అప్పటి కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ పార్లమెంట్‌లో ప్రకటించారు. నాసిరకం మందుల తయారీదారులు, అమ్మకందారులను బహిరంగంగా ఉరితీయాలని ఆవేశంగా మాట్లాడారు. కానీ నాసిరకం మందుల తయారీదారులపై మోడీ ప్రభుత్వం ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పర్యవేక్షణ పెంచలేదు. ప్రాణాలను కాపాడ్డానికి ఔషధాలను తయారుచేసే ఫార్మా కంపెనీలు అధిక లాభాల కోసం మనుషుల ప్రాణాలను తీయడానికి సైతం సిద్ధపడుతున్నాయని ఈ ఘటనలు తెలియజేస్తున్నాయి. ఫార్మా ఉత్పత్తులు, ప్రోత్సాహకాలపై ప్రభుత్వాలు దృష్టి పెడుతున్నాయి తప్ప వాటిలో నాణ్యతను పరిశీలించడంలేదు. ఉత్పత్తి సంస్థలు చేస్తున్న తప్పిదాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధపడటంలేదు. ఔషధ నియంత్రణ వ్యవస్థను పటిష్టం చేయడంలేదు. యాభై ఔషధ కంపెనీలకు, రెండొందల మందుల షాపులకు ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వుండాలన్న సిఫార్సులను అమలు చేయడంలేదు. నాణ్యత, ప్రమాణాలను పరీక్షించాల్సిన సిబ్బంది లేకపోవడం, పర్యవేక్షణ కొరవడటంతో మందులు విచ్చలవిడిగా మార్కెట్లోకి చేరుతున్నాయి.

గాంబియాలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో భారత్‌కు చెందిన 16 మందుల కంపెనీల దిగుమతులపై నేపాల్ ప్రభుత్వం గత డిసెంబరులో నిషేధం విధించింది. ఇందులో రామ్‌దేవ్ బాబాకు చెందిన దివ్య ఫార్మసీ, పతంజలి ఉత్పత్తులు కూడా వున్నాయి. భారత్ లోని ప్రముఖ మందుల ఉత్పత్తి కంపెనీలు కూడా నిషేధిత జాబితాలో వున్నాయి. అనేకసార్లు అమెరికా, ఐరోపా దేశాలకు ఎగుమతి చేసిన భారత్‌కు చెందిన ప్రఖ్యాత కంపెనీల మందులు తరచూ వెనక్కి వస్తున్నాయి. నేపాల్ ప్రభుత్వం నిషేధించిన మందులు భారత్ మార్కెట్‌లో వినియోగంలో వున్నాయంటే, ప్రభుత్వం మందుల కంపెనీల పట్ల ఎంత ఉదారంగా వ్యవహరిస్తున్నదీ అర్థమవుతుంది.

ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం భారత ఔషధ నియంత్రణ వ్యవస్థను పటిష్టపరచాలి. ఉత్పత్తిలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చట్టాలకు మరింత పదును పెట్టాలి. నాసిరకం మందులు తయారుచేసే వారిపై కఠిన చర్యలు తీసుకొనేలా వ్యవస్థలను బలోపేతం చేయనంతకాలం ప్రజల ప్రాణాలకు రక్షణ వుండదు. ప్రయివేటు మందుల ఉత్పత్తిదారులను ప్రోత్సహించి, ప్రభుత్వ రంగం లోని ఔషధ కంపెనీలను మూసివేసిన దుష్ఫలితాలు ఇప్పుడు ఈ రూపాల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. ప్రయివేటు ఔషధ కంపెనీల మోసాలకు ప్రభుత్వాలు ముకుతాడు వేసి, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి. 'లెంటిన్' సిఫారసులను ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలుచేయాలి.

# 'ఫేక్' ఉత్తర్వులతో సోషల్ మీడియాపై కత్తి

ఓడ ఎక్కేవరకూ ఓడ మల్లయ్య అన్న పెద్దమనుషులు ఓడ దిగాక ఏమంటారో ఆ సామెత తెలిసిన తెలుగువాళ్లకు బాగా తెలుసు. ప్రధాని నరేంద్ర మోడి సర్కారు విధానం అచ్చంగా ఆ సామెతకు నకలుగా తయారైంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా మూడు పర్యాయాలు ఎన్నికైన మోడీ ప్రధాని అభ్యర్థిగా ప్రచారంలోకి రావడానికి సోషల్ మీడియాను సోపానంగా వాడుకున్నారు. కార్పొరేట్ల సాయంతో వేలాది మంది యువతను నియోగించి అహొరాత్రులు ఆయన ఘనతను హోరెత్తించారు. ఉత్తుత్తి ఫోటోలు సృష్టించారు. పాత చరిత్రను మార్చి కొత్త ఇమేజి తేవడానికి తంటాలు పడ్డారు. ఆఖరుకు నరేంద్రమోడీ బిజెపి కార్యాలయం తుడుస్తున్న ఫోటో, ఛారువాలా కథ, చదువుకున్న పట్టాలు ఏవీ నిజమని నిరూపించుకోలేకపోయారు. ఈ పట్టాను గురించిన సమాచారం ఇవ్వవలసిందిగా సంబంధిత సంస్థను ఆదేశించినందుకు తెలుగువాడైన జాతీయ సమాచార హక్కు కమిషనర్ డాఎం మాడభూషి శ్రీధర్‌ను తప్పించారు కూడా. బిజెపి, ఆరెస్సెస్ మార్కు అసత్య కథనాలు కట్టుకథలు తట్టుకోలేక వార్తాసంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవలసి వచ్చింది. ప్రత్యేక పరిశోధకులను నియమించి నిరూపించవలసి వచ్చింది. ఇదిగో ఈ ఫోటోను మార్ఫింగ్ చేసి కొత్తది తయారు చేశారని లేదంటే అబద్ధాలతో లేని కథ వండివార్చారని సోదాహరణలతో ఎన్నో కథనాలు బయటపెట్టాయి. కొన్నిసార్లు ఈ పరిశోధన తీవ్ర ఇరకాటంలో పెట్టింది. తమ నిజస్వరూపం బయట పెట్టిన వారిపై కక్ష సాధింపులకూ వేధింపులకూ పాల్పడింది. ఆల్ట్ మీడియా అనే సంస్థ ఇందులో విశేషమైన కృషి చేసింది గనక ఆ సంస్థ అధినేతలలో ఒకరైన మహమ్మద్ జుబేర్‌ను జైలుపాలు చేసింది. సరిగ్గా ఇప్పుడు ఆ అనుభవాన్నే మోడీ సర్కారు మరోవైపు నుంచి ప్రయోగించడానికి సిద్ధమైంది. ఫేక్ న్యూస్ ప్రసారం చేస్తే సహించేది లేదని బెదిరించడమే గాక ఏది నిజం ఏది ఫేక్ అని నిర్ధారించే అధికారం తన చేతుల్లోకి తీసుకుంటున్నది. విమర్శనా స్వేచ్ఛకు, వాస్తవాల వెల్లడికి సాధనాలుగా వుండాల్సిన మీడియా, సోషల్ మీడియాలను నియంత్రించేందుకు కొత్త చట్టాలు బిగిస్తున్నది.

### ఏమిటీ సవరణ?

సోషల్ మీడియా ఇంతగా విస్తరించక ముందు ఇన్ఫర్మేషన్ చట్టం-2000 పని చేస్తూ వచ్చింది. ఈ చట్టంలో సెక్షన్ 69(1) కింద ఏదైనా సంస్థ లేదా మీడియా ప్లాట్‌ఫారమ్ ప్రకటించిన వార్త దేశానికి హానికరమైనదని, ఉద్రేకాలు పెంచుతుందని భావిస్తే పోలీసులు కేసు పెట్టొచ్చు. మారిన పరిస్థితులలో ఆ చట్టం సరిపోలేదని 2019లో ఫేక్ వార్తల అదుపునకు పిఐబి కమిటీ వేశారు. 2021లో కొత్త సవరణ తీసుకొచ్చారు. వాటి ప్రకారం బనాయించిన అనేక కేసులు సుప్రీం కోర్టు ముందు విచారణలో వున్నాయి. చాలాసార్లు అత్యున్నత న్యాయమూర్తులే వీటిపై విమర్శలు చేశారు, కేంద్రం తన వైఖరి చెప్పాలని తాఖీదులిచ్చారు. కేంద్రం ఆరు నెలల గడువు కోరింది. ఈ కాలంలో ఆ ఆంక్షలు అమలులో వుండవని సుప్రీం ప్రకటించింది. మరోవైపు 2021 సమాచార సాంకేతిక పరిజ్ఞానం నిబంధనల సవరణ ముసాయిదా తీసుకొచ్చింది. దాంతో వ్యూహాత్మకంగా కేంద్రం కొత్త ఎత్తు ఎత్తింది. ఆ ప్రకారం పిఐబి నియమించే ఫేక్‌వార్తల నియంత్రణ కమిటీ లేదా ప్రభుత్వం అందుకోసం నియమించే మరేదైనా కమిటీకి ఏకపక్ష నిషేధ అధికారం కల్పించారు. ఆన్‌లైన్ గేమింగ్‌ను నిరోధించడానికి ఈ చట్టం తెచ్చామని పైకి చెబుతున్నారు గాని నచ్చని అంశాల ప్రచురణలను తొక్కిపట్టడం కోసం అంతకన్నా తీవ్రమైన అంశం జోడించారు. సోషల్ మీడియా వేదికలలో అంటే యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఓటిటి వంటి వాటిలో వచ్చిన వార్తా కథనాలు (కంటెంట్) అవాస్తవమైతే వాటిని తొలగించే అధికారం పిఐబికి వుంటుందని ఆ సవరణలో ప్రతిపాదించారు. వాటిని తీసేయవలసిందిగా ఆదేశిస్తే మధ్యంతర వ్యవస్థలైన అగ్రిగేటర్లు (అంటే వాటిని నిర్వహించే యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఓటిటి సంస్థలు) అమలు చేయవలసి వుంటుంది. బూటకపు కథనాలు తొలగిస్తే మంచిదే కదా అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ అసలు సమస్య అక్కడే ఉత్పన్నమవుతుంది. ఏది నిజమో ఏది బూటకమో నిర్ణయించేది ఎవరు? వాటికి కొలబద్దలేమిటి?

### గత అనుభవాలేమిటి?

గతంలో నియమితమైన పిఐబి కమిటీ అనుభవం తీసుకుంటే చాలా దారుణంగా వుంది. అనేకసార్లు ఈ కమిటీ కొన్ని వార్తలు బూటకమని (ఫేక్) ప్రకటించింది. కాని ఈ ప్రకటనలే బూటకమైనాయి. సంఘపరివార్ లేదా ప్రభుత్వం విడుదల చేసే ఫేక్‌లు తేల్చడానికి సోషల్ మీడియాలో కొందరు కృషి చేస్తూ వచ్చారు. ఉదాహరణకు 2020 డిసెంబరులో కేంద్ర నిఘా విభాగం (ఐబి) తరపున విడుదలైన నియామకాలకు సంబంధించిన అడ్వర్టయిజ్‌మెంట్ బూటకమని గొప్పగా ప్రకటించింది. తర్వాత చూస్తే అది అధికారికంగా ఇచ్చిందేనని తేలింది. పిఐబి తన ట్వీట్‌నే తొలగించుకోవాల్సి వచ్చింది. ఇక పరివార్ దుష్ప్రచారాలకు లోటే లేదు. కరోనా సమయంలో ఆర్ణబ్ గోస్వామి వంటి వారు వలస కార్మికులు తరలిపోతున్న ఫోటోను మసీదు బ్యాక్‌గ్రౌండ్‌తో ఇవ్వడం ఎంత కలవరం కలిగించిందో గుర్తుండే వుంటుంది. కరోనా కాలంలో ఢిల్లీలోని తబ్లిగీ జమాయత్ మర్కజ్ సంస్థలో ఏం జరిగింది? ఈ విషయంలో అప్పట్లో ప్రధానితో సహా చేసిన ప్రకటనలు ఎలా వున్నాయి? మతాల మధ్య చిచ్చు పెట్టడానికి తప్పుడు కథనాలు వదలడంపై చివరకు సుప్రీం కోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. హత్రాస్ ఘటన లోనూ బూటకపు చిత్రాలు వచ్చాయి. నిజమైన ఫోటోలు మార్ఫింగ్ ఫోటోలు పక్కపక్కనే చాలాసార్లు ప్రచురితమైనాయి (ఇలాంటి దారుణమైన అనుభవాలు తెలుగు రాష్ట్రాలలోనూ వున్నాయి. వాటిలోకి వెళితే ఎవరు ఏమిటి అన్నది మరో వివాదమవుతుంది.). విచిత్రమేమంటే పిఐబి ఏర్పాటు చేసిన కమిటీ పరివార్ ప్రచారాల జోలికి పోయిందే లేదు. వారు వెల్లడించిన, ఖండించిన కథనాలలో నూటికి తొంభై ప్రతిపక్షాలకు సంబంధించినవే. రాహుల్ గాంధీ యాత్ర సందర్భంలో ఫోటోలు లేదా ప్రకటనలు, ఇతర ప్రతిపక్షాలు లేదా మీడియా సంస్థలు కథనాలు సమాచారాలపైనే ఎక్కడలేని కేంద్రీకరణ చూపించడం అనుభవంలో చూశాం. పిఐబి అనేది మౌలికంగా ప్రభుత్వ విధానాలను లేదా కృషిని ప్రజలకు మీడియాకు తెలియజేయడానికి ఉద్దేశించిన సంస్థ. ఆ సంస్థ ప్రచారంలో పెట్టే విడుదల చేసే ప్రకటనలు ఎంత వరకూ నిజమని తేల్చవలసిన బాధ్యత మీడియా పైన సోషల్ మీడియా పైన ఇంకా ప్రతిపక్షాలు ప్రజా సంస్థల పైన వుంటుంది. దీన్ని అటూ ఇటూ తిప్పి తక్కిన వారిపై నిఘా వేసి కంటెంటు తొలగించే అధికారాలివ్వడం తలకిందులు తర్కం. ఉదాహరణకు ఇటీవల ప్రధాని విశాఖ పర్యటనకు వచ్చినపుడు జరిగిన కార్యక్రమాలలో తొంభై శాతం శంకుస్థాపనలు మాత్రమే. ఆ విషయం గట్టిగా చెబితే పిఐబి దాడి చేస్తుంది. ఎందుకంటే ఆ శంకుస్థాపనలు అంచనాల మొత్తంవారు అభివృద్ధి కింద చూపిస్తుంటారు. 'ఊరి' సైనిక కేంద్రంపై దాడి, పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రయిక్స్ వంటి వాటిపై విపరీత ప్రచారం జరుగుతుంది. వాటికి సంబంధించిన నిజానిజాలు అడిగితే దేశభద్రతకు ముప్పంటారు. ఇంకా చెబితే దేశద్రోహం ముద్ర వేస్తారు. భారత్-చైనా సరిహద్దులలో పరిస్థితిపై ఏవో కథనాలు వస్తాయి. పూర్తి వివరాలు అడిగితే దాటేస్తారు. ప్రత్యారోపణలు చేస్తారు. ఇలాంటి అనేక సందర్భాలు చూశాం. అసలు పరిశోధనాత్మక జర్నలిజంలో జరగాల్సిందే అది. మోడీ ప్రభుత్వం క్రమంగా ఆ విధమైన పరిశోధనాత్మక జర్నలిస్టులనే వేటాడి ద్రోహుల జాబితాలో చేర్చింది. సర్వాధికారాలు పిఐబికి కట్టబెట్టే కొత్త నిబంధనలు వస్తే గనక ఏలినవారు చెప్పే అసత్య కథనాలు, లేనిపోని గొప్పలే జనానికి వార్తలవుతాయి. ప్రశ్నించడం పరిశోధించి రాయడం అపరాధమవుతుంది. పిఐబి వాటిని తొలగించాలని ఆదేశిస్తుంది. అంటే ఏ ప్రభుత్వ నిర్వాకాలనూ నిజాలనూ మీడియాలో సోషల్ మీడియాలో నిగ్గు తేల్చడం జరగాలో అదే తీర్పరిగా, నియంత్రణకర్తగా మారిపోతుంది. విడుదల చేసిన ముసాయిదాలో దానిపై నిర్దిష్టమైన కొలబద్దలు కూడా లేవు.

ఈ కారణంగానే ప్రతిపక్షాలూ మీడియా సంస్థలూ పత్రికా యాజమాన్యాలు, ముక్తకంఠంతో ఒక్క గొంతుతో సమాచార స్వాతంత్ర్యం మెడపై కత్తి లాంటి ఈ సవరణలను ఉపసంహరించుకోవాలని కోరుతున్నాయి. ఎడిటర్స్ గిల్డ్, న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్ (ఎన్‌బిడిఎ), ది ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్‌ఎస్), అనేక జర్నలిస్టుల సంఘాలు ఈ మేరకు సవివరమైన సోదాహరణమైన ప్రకటనలు చేశాయి. ఒత్తిడి, విమర్శలు పెరిగాక కేంద్ర ప్రభుత్వ ఐటి శాఖామంత్రి రాజీవ్ చంద్రశేఖర్ కొన్ని సన్నాయి నొక్కులతో కొన్ని వివరణలు ఇచ్చారు.

## జాతిపిత మహాత్మాగాంధీకి ఘన నివాళి



జి.కొండూరు:జనవరి 30:(ప్రజాపాలన ప్రతి నిధి):జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం మైలవరం నియోజక వర్గ పరిధిలోని కొండపల్లి మార్కెట్ సెంటర్ నందు,మరియు ఆర్యవైశ్య కళ్యాణ మండపం రోడ్డులో గల గాంధీజీ విగ్రహాలకు మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల గాంధీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,భారతదేశానికి స్వతంత్రం తీసుకొచ్చిన ఎంతోమంది మహానుభావులలో మహాత్మా గాంధీ పేరు ఎప్పుడు మొదట ఉంటుందని,అసత్యాన్ని విడనాడి సత్యాన్ని చేతపట్టి ధర్మ మార్గంలో నడిచి, బ్రిటిష్ వారిని తరిమి కొట్టిన గొప్ప నేత గురించి మనం తప్పకుండా తెలుసుకోవాల్సిందేనన్నారు.అహింస మార్గంలో మాత్రమే మనం మన హక్కులను సాధించగలం మని మరియు ఆయన జాతిపితగా ఎదిగిన వైనం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు యర్రంశెట్టి నాని,సామల సుజాత, రామాంజనేయులు,రాగాల నాని,దూడల ఈశ్వర్,నాగభూషణం,బొమ్మల రమేష్,చరణ్, సిరిపురం సురేష్, శ్రీనివాస్ రావు,తదితరులు పాల్గొన్నారు.

## స్పందనలో 28 వినతుల స్వీకరణ



నరసాపురం, జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి) :స్పందనలో అందిన అర్జీల పరిష్కారంలో ఫిర్యాదు దారులు సంతృప్తి చెందే విధంగా అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను సబ్ కలెక్టరు ఎం. సూర్య తేజ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 28 పిర్యాదులను సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించే విధంగా మండల స్థాయి అధికారులు చర్యలుతీసుకోవాలని స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని సబ్ కలెక్టరు ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భూసమస్యలు , రేషనుకార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, భూమి తగాదాలు, మత్స్యశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమం తదితర సమస్యలపై వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో డివిజన్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగామహా త్మాగాంధీ వర్ధంతి వేడుకలు



కంచి చర్ల జనవరి 30 ప్రజాపాలన ప్రతినిధి: మహా త్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు బాపూజీ చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులు అర్పించారు అనంతరం గడపగడ పకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూమంచి పరిపాలనతో ప్ర జల గుం డెల్లో సుస్థిర స్థానం సంపాదించిన ముఖ్య మంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డన్నారుఈ కార్య క్రమంలో గ్రా మ సర్పంచ్ -ఉప సర్పంచ్, ఎంపీటీసీ స భ్యులు, వా ర్డు సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జగన్ కు స్వాగతం పలికిన నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి )ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వినుకొండ వచ్చిన సందర్భంగా నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు.సోమవారం వినుకొండ నియోజకవర్గంలో జగనన్న చేదోడు కార్యక్రమం పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి . జగనన్న చేదోడు మూడో విడత ఆర్థిక సహాయం వినుకొండ విచ్చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి .

## వసంతకుమార్ కు కాపుసంఘం నివాళులు



నరసాపురం, జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి) :మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ ఆకస్మిక మరణం తీరనిలోటని ఆయన ఆత్మకు శాంతి కలగాలని నియోజకవర్గ కాపు సంఘం నేతలు ఆయనకు ఘన నివాళులర్పించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్లో సోమవారం నరసాపురం నియోజకవర్గ కాపు సంఘం ఆధ్వర్యంలో మాజీమంత్రి వట్టి వసంతకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు కాపు నాయకులు మాట్లాడుతూ పలువురు నాయకులు మాట్లాడుతూ వసంతకుమార్ మంచి మనసున్న నాయకుడని, రాజకీయాలలో నీతి నిజాయితీలతో పనిచేశారని ఆయన కుటుంబం పేదలకు ఎన్నో సేవలు చేశారని వారు కొనియాడారు. నాలుగు పర్యాయాలు మంత్రిగా రాష్ట్రానికి సేవలు అందించిన వసంత కుమార్ అందరివాడిగా పేరు సంపాదించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో నియోజకవర్గ కాపు సంఘం కన్వీనర్ కోటిపల్లి సురేష్, పట్టణ అధ్యక్షుడు తమ్మిశెట్టి బాబ్జీ, మండల అధ్యక్షుడు అడబాల అయ్యప్పనాయుడు, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్ నాయుడు, చిట్టూరి కృష్ణ, కావలి నాని, వన్నెంరెడ్డి శ్రీనివాస్, బళ్ళ వెంకటేశ్వరరావు, కారిచర్ల ఈశ్వరరావు, గుగ్గిలపు మురళి, మేడిది రాము, యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, మండెల కృష్ణస్వామి నాయుడు, చల్లా సత్యనారాయణ, గాధి వనమయ్య తదితరులు పాల్గొన్నారు.

## జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి జనవరి 30 : భారత జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆనందపురం గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్లో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ఆనందపురం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుడ్డేపు శ్రీనివాసు రావు మహాత్మ గాంధీ యొక్క గొప్పతనాన్ని ఆయన చేసినటువంటి ఉద్యమాల గురించి సత్యం అహింస ఆయుధాలుగా చేసుకుని బ్రిటిష్ వాళ్ళపై పోరాడి భారతదేశానికి స్వతంత్రం సాధించరని ఆయన తెలియజేయడం జరిగింది అదేవిధంగా జై జవాన్ ఫౌండేషన్ అధ్యక్షులు కుప్పరాజశేఖర్ మాట్లాడుతూ భారతదేశానికి బానిస సంకెళ్లు తెంచిన మహనీయుడు 1869 అక్టోబర్ 2 పోరుబందర్ గుజరాత్ లో జన్మించి 1948 జనవరి 30వ తారీఖున మరణించడం జరిగిందని అహింస మార్గంలో అనేక ఉద్యమాలను నడిపి భారతదేశానికి స్వాతంత్రం సాధించారు ప్రస్తుతం ఉన్న యువతంతా కూడా మహనీయులు అడుగుజాడల్లో నడిచి సమాజానికి ఎంతో కొంత సహాయం చేయాలని తెలియచేశారు ఈ యొక్క కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బొడ్డేపు శ్రీనివాసరావు జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్పరాజశేఖర్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను ఇమంది శ్రీనివాసరావు కుప్ప రాము ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కే రామకృష్ణ పట్నాయక్ రమణ అజీవ్ నిర్మల కుమారి చంద్రమతి దేవి భవాని రజియా బేగం మున్నా బేగం మహేష్ శివాజీ అప్పారావు తదితరులు పాల్గొనడం జరిగింది.

## మానవత్వం చాటుకున్న...మనసున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



పల్నాడు జిల్లా .నరసరావుపేట . జనవరి 30 ( ప్రజా పాలన ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా వినుకొండలో మూడో విడత జగనన్న తోడు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో హెలిపాడ్ నుండి సభాస్థలికి వెళ్ళు మార్గమధ్య లో రెండు సంవత్సరాల క్రితం ఇల్లు కాలిపోయిన బాధితురాలు మస్తానమ్మను, తల సేమియా తో బాధపడుతున్న చిరంజీవి తేజ లను పరామర్శించి తక్షణమే ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శివశంకర్ లోతేటిని ఆదేశించారు. తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి కార్యక్రమం అనంతరం వినుకొండ మున్సిపల్ ఆఫీస్ కార్యాలయంలో మస్తానమ్మకు వినుకొండ పట్టణ పరిధిలో అనువైన చోట ఇంటి స్థలము, ఇల్లు కట్టుకోవడానికి నగదు మరియు తక్షణ సహాయంగా 50,000 రూపాయలు స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు తో కలిసి అందించారు. బాపట్ల జిల్లాకు చెందిన నారాయణస్వామి కుమారుడు రెండో తరగతి చదువుతున్న చిరంజీవి తేజ తల సేమియా వ్యాధి నుండి బయటపడే విధంగా తక్షణ సహాయంగా లక్ష రూపాయలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెన్నైలోనే రేవెల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిరంజీవి తేజకు 27 లక్షల రూపాయలు ఖర్చవుతుంది అని తెలిపారని అందులో ఆరోగ్యశ్రీ కింద పది లక్షల రూపాయలు తక్షణసాయంగా లక్ష రూపాయలు అందించామని మిగిలిన 16 లక్షల రూపాయలకు బాపట్ల జిల్లా కలెక్టర్ తో చర్చించి సీఎంఆర్ఎఫ్ నిధులు అందించేలా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి అద్దయ్య, నరసరావుపేట ఇన్చార్జి ఆర్డీవో వసంత కుమార్, మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 176 రోజులుగా కొనసాగుతున్న అన్నా క్యాంటీన్



జగ్గయ్యపేట జనవరి 30 ప్రజా పాలన ప్రతినిధి పట్ట ణంలోని గత 176 రోజులుగా మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ ను పేద ప్రజల ఆకలి తీర్చేందుకై వారి సొంత, దాతల నిధులతో నిర్వహిస్తూ వస్తున్నారు. ఇదే క్రమంలో సోమవారం కూడా అన్నా క్యాంటీన్ ను నిర్వహించారు. సోమవారం డివిఆర్ నగర్ వస్తవ్యులు నలమోలు హ రిహర ప్రసాద్ (లేటు) ఉషారాణి కనిష్ఠ పుత్రుడైన న లమోలు మిహిరతేజ జన్మదిన సందర్భంగా కార్తీక వి తరణతో అన్న క్యాంటీన్లో అన్న ప్రసాదం ఏర్పాటు చే సినారు ఈ కార్యక్రమంలో బోందుల బాలాజీ సింగ్, కేళి నాగేశ్వరరావు, గొట్టే నాగరాజు, గుంజానరసయ్య, తాటి రామరావు, పొలవరపు కృష్ణ, కొర్ర కుటి సైదు లు, షేక్ ఇంతియాజ్ , రచ్చ శ్రీను, గన్నవరపు పుల్ల య్య,షేక్, నాగులుమీరా షేక్ సైదా,పాల్గొన్నారు

## ఘనంగా ముగిసిన గోపిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి మెమోరియల్ ఒంగోలు జాతి వృషభరాజముల బండ లాగుడు బల ప్రదర్శన



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి): పల్నాడు జిల్లా నరసరావుపేట డి.ఎస్.ఎ స్టేడియంలో గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ముగిసిన జాతి వృషభరాజుముల బండ లాగుడు బల ప్రదర్శన కార్యక్రమంలో 8 రోజూ పాటు ఉమ్మడి ఆంధ్రా రాష్ట్రాల పలు జిల్లాలో నుంచి 129 జతలు పాల్గొనడం జరిగింది, ఈ ప్రదర్శన విజేతలైన యజమానులకు బహుమతులు ప్రధానోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ మంత్రివర్యులు కాకాని గోవర్ధన్ ,రాష్ట్ర అగ్రికల్చర్ మిషనరీ వైస్- చైర్ పర్స్ నాగిరెడ్డి , గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి , నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు ,తాడికొండ శాసనసభ్యులు ఉండవల్లి శ్రీదేవి ,మరియు వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలలో మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ జనవరి 30 ప్రజాపాలన ప్రతినిధి: జాతిపి త మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా జాతిపిత చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూజా తిపిత గాంధీ మహాత్ముని భావాలు దేశ ప్రజల మన సులో ఇంకా మెదలుతూనే ఉన్నాయన్నారుసత్యా గ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడి కో ట్లాది భారతీయులకు స్వేచ్ఛ స్వాతంత్రాన్ని అందించి న మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని కొ నియాడారు ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ప్ర జలు తదితరులు పాల్గొన్నారు

## వసంతకుమార్ కు ఎమ్మెల్యే గ్రంధి నివాళులు



భీమవరం, జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి) :మాజీమంత్రి వట్టి వసంతకుమార్ కుటుంబ సభ్యులను శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ భీమడోలు మండలం పూళ్ల గ్రామంలోని ఎంఎం పురంలో సోమవారం పరామర్శించారు. ముందుగా ఆయన వసంతకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉంగుటూరు ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా, పర్యాటక శాఖా మంత్రిగా రాష్ట్రానికి ఎనలేని సేవలు అందించిన ఉన్నత వ్యక్తిత్వం కలిగిన రాజకీయ నాయకుడు వట్టి వసంతకుమార్ అని ఆయన సేవలను కొనియాడారు. వసంతకుమార్ మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు.

## భారతీయ జనతాపార్టీ విశాఖ జిల్లా కార్యవర్గ సమావేశం



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి జనవరి 30 :జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రేటర్ విశాఖ పరిధిలో 26 వార్డ్ నుంచి పొట్నూరు కృష్ణారావు, కళింగ వైశ్య ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో పలువురు బిజెపిలో చేరిక. ఈ సందర్భంగా,రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు గారు, ఉత్తర నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు పెనుమత్స విష్ణుకుమార్ రాజు గారు,బిజెపి పార్టీ లోకి ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమంలో నూకల మధుకర్ రాష్ట్ర కార్య నిర్వహణ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్, విశాఖ జిల్లా ఇంచార్జ్ కోడూరు లక్ష్మీ నారాయణ రావు గారు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వి.ఎస్ ప్రకాష్ రెడ్డి రాష్ట్ర యువమోర్చా అధ్యక్షులు కేతినేని సురేంద్రమోహన్ గారు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్,కేశవ కాంత్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్,ఎస్సీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఎన్.పి. చక్రవర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి,దిలీప్ వర్మ, జిల్లా ఉపాధ్యక్షులు చొక్కకుల రాంబాబు, కిసాన్ మోర్చ ఉత్తరాంధ్ర జోన్ సోషల్ మీడియా కన్వీనర్ పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్,రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ రూపాకుల రవికుమార్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, పార్టీ పెద్దలు పార్టీ బలోపేతం కోసం చర్చించారు.




## అమలాపురంలో జగనన్న చేదోడులో పాల్గొన్న జిల్లా కలెక్టర్



అమలాపురం జనవరి30 ప్రజాపాలన ప్రతినిధి.: జగనన్న చేదోడు పథకం కింద దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బీసీ వర్గాలకు ఆర్థికాభివృద్ధికి, ఆర్థిక భరోసాన్ని అందించాలని సంకల్పంతో ఏటా పదివేలు రూపాయలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హి మాన్షు శుక్లా పేర్కొన్నారు. జగనన్న చేదోడు మూడో విడత నిధులు విడుదల కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ స్థానిక కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు చెందిన రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు -ఏడాదికి రూ. 10,000/- చొప్పున ఆర్థిక సహాయం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు..వారి జీవనోపాధి అవకాశాలను మరియు జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి 21 సంవత్సరాల మరియు 60 సంవత్సరాల మధ్య వయస్సు గల 5 సంవత్సరాల వ్యవధిలో సంవత్సరానికి రూ 10,000 చొప్పున అందించడం జరుగు తుందన్నారు.వరుసగా మూడో ఏడాది జగనన్న చేదోడు పథకం కింద రజక, నాయీబ్రాహ్మణ, దర్జీ అన్నద మ్ములు, అక్కచెల్లెమ్మల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమ వారం కానుక అందించారన్నారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ సీమ జిల్లా వ్యాప్తంగా 11,419 మంది అర్హులైన రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ. 11.42 కోట్ల ఆర్థిక సాయాన్ని పల్నాడు జిల్లా వినుకొండలో సోమవారం బటన్ నొక్కి జమ చేయడం జరిగింద న్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది 1310 మంది అదనంగా లబ్దిని పొందారన్నారు ఈ కార్యక్రమంలో పి గన్నవరం. శాసనసభ్యులు కొండేటి చిట్టిబాబు జిల్లా వక్స్ బోర్డ్ అధ్యక్షులు షేక్ ఖాదర్ వల్లి, రాష్ట్ర దృశ్యకతల అకాడమీ చైర్మన్ కె సత్య శైలజ, పురపాలక సంఘ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ టీ. వెంకటేశ్వర్లు స్థానిక ప్రజాప్రతిని ధులు లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చైర్మన్ మట్టపర్తి రామరావుకు పిత్ర వియోగం. పరామర్శించిన జర్నలిస్ట్ వినయ్ కుమార్



అయినవిల్లి జనవరి30 ప్రజాపాలన ప్రతినిధి.:ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సీనియర్ నాయకులు మరియు మాజీ సర్పంచ్, ఎంపీటీసీ ప్రస్తుత సొసైటీ బ్యాంక్ చైర్మన్ మట్టపర్తి రామారావు పిత్ర వియోగంతో బాధపడుతున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజకవర్గమైన అయినవిల్లి మండలం శానపల్లిలంక సొసైటీ బ్యాంక్ చైర్మన్ మట్టపర్తి రామారావు, కన్నతల్లి అయిన మట్టపర్తి సత్యవతి 95 సం" ఈనెల జనవరి 28 తేదీ శనివారం రాత్రి అనారోగ్య కారణం చే వైద్యం పొందుతూ అమలాపురం కిమ్స్ హాస్పిటల్ నందు తుది శ్వాస విడిచారు. అయితే సోమవారంపిత్ర వియోగంతో బాధపడుతూ దుఃఖం లో ఉన్న చైర్మన్ రామారావు ను స్థానిక శాసనసభ్యులు కొండేటి చిట్టిబాబు, మండల జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్ లు విమర్శించి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ క్రమంలో నే స్థానిక అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజాపాలన తెలుగు జాతీయ దినపత్రిక ఇన్ చార్జ మరియు లోకల్ యాప్ రిపోర్టర్ నేరేడుమిల్లి వినయ్ కుమార్, మాజీ సర్పంచ్ కడలి తిమూర్తులు, మాజీ స్కూల్ చైర్మన్ పోలీస్ రామారావు, జగన్నాథపురం సొసైటీ చైర్మన్ మట్టపర్తి సత్యనారాయణ,బుల్లి అబ్బులు. కడలి సత్తిపండు, దోమ్మేటి త్రిమూర్తులు, మట్టపర్తి వీర వెంకట సత్యనారాయణ,బోక్క అప్పారావు, దంగేటి చిరంజీవి, దోమ్మేటి సాంబశివరావు, బాస్కర విశ్వేశ్వరరావు, బోక్క ప్రసాద్, దంగేటి రమణ, మట్టపర్తి వేంకటేశ్వరరావు, మట్టపర్తి కొండబాబు, మట్టపర్తి విశేశ్వరరావు, మట్టపర్తి అభిరామ్. తదితరులు రామారావును మరియు వారి కుటుంబాని పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలు




కారంపూడి... జనవరి30...ప్రజాపాలన... ప్రతినిధి :పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు అనంతరం గాంధీ విగ్రహానికి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మరియు ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్షిప్ ముగింపు వేడుకలు



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: రెండు రోజుల పాటు జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి మినీ సబ్ జూనియర్ ఓపెన్ ఛాంపియన్ షిప్ -2023 పోటీలు లాలాచెరువు లోని విజయ్ బ్యాడ్మింటన్ అకాడమీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం ముగిశాయి.ఈ పోటీలను స్పాన్సర్ చేసిన జనసేన పార్టీ రాజమండ్రి సిటీ ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ సతీమణి అత్తి అనూరాధా దేవి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతి ప్రధానం చేశారు.విజయ్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకుడు విజయ్ మాట్లాడుతూ జనసేన నాయకుడు అనుశ్రీ సత్యనారాయణ సౌజన్యంతో ఈ చాంపియన్షిప్ ముగిసిందన్నారు. రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుంచి సుమారు 270 మంది బాలబాలికలు హాజరయ్యారన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించారన్నారు. క్రీడాభివృద్ధికి దాతలు సహకారం అందించాలని కోరారు. సహకారమందితే ఇంకా భారీగా క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి లు దూడల త్రినాథ్, బాలు, జాయింట్ సెక్రెటరీ వైవిడి ప్రసాద్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నాడ శ్రీను, నగర ఉపాధ్యక్షులు గుత్తుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు పైడిరాజు, నల్లంశెట్టి వీరబాబు, కార్యదర్శులు విన్నా వాసు, గుణ్ణం శ్యామసుందర్, జనసేన యువ నాయకులు బయ్యపునీడి సూర్య, మంచాల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## రావులమ్మ అమ్మవారిని దర్శించుకున్న అనకాపల్లి సిద్ధాంతి వీరాంజనేయులు



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి: కాకినాడ జిల్లా జగ్గంపేట జనవరి 30: జగ్గంపేట గ్రామదేవత రావులమ్మ అమ్మవారిని దర్శించుకున్న అనకాపల్లి సిద్ధాంతి వీరాంజనేయులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ధర్మకర్త జీను రాంబాబు రావులమ్మ అమ్మవారి చిత్రపటం బహుకరించి ప్రసాదాలు అందించారు. సందర్భంగా సిద్ధాంతి వీరాంజనేయులు మాట్లాడుతూ జగ్గంపేట ప్రాంతంలో రావులమ్మ అమ్మవారిని ఇష్టంగా పూజిస్తారని అదేవిధంగా సంక్రాంతి పురస్కరించుకుని కనుమ రోజు జాతర గ్రామంలోని ముఖ్య కాలనీలవారు అమ్మవారి సంబరాలు ఘనంగా నిర్వహిస్తారని గొప్ప విశిష్టత కలిగి అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని రావులమ్మ అమ్మవారి సమస్త మానవాళిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఆధ్యాత్మిక సేవకుడు కర్రీ రామచంద్ర రెడ్డి( శ్రీనివాస్ రెడ్డి) దాట్ల సురేష్ రాజు పాల్గొన్నారు.

## గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల ఆవిష్కరణ



భీమవరం, జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి) :జాతిపిత మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా సోమవారం భీమవరం మండలం యనమదుర్రు గ్రామంలోని ఎలిమెంటరీ స్కూలులో ది భీమవరం రూరల్ మండల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఆవిష్కరించారు. యనమదుర్రు గ్రామపంచాయతీ ప్రెసిడెంట్ బోరాబత్తుల రామ్మూర్తి మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించగా, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని బొండాడ రాంపండు ఆవిష్కరించారు. యనమదుర్రు గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ తిరుమల విజయరామ్ శిలాఫలకం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భీమవరం రూరల్ మండల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పర్రిపాటి శ్రీను, ప్రధాన కార్యదర్శి సత్యవరపు శ్రీకాంత్, కోశాధికారి సోమ వెంకటేష్, ది భీమవరం రూరల్ మండలం ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు పర్రిపాటి రత్నకుమారి, ప్రధాన కార్యదర్శి సోమ మౌనిక, కోశాధికారి సత్యవరపు శాంతి మరియు జిల్లా సంఘ నాయకులు సోము కపర్ది, బచ్చు కాశీ, జూలూరి నాగేశ్వరరావు, బలబద్ర బాబి, వబిలిశెట్టి రంగారావు, సంఘ సభ్యులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు



జగ్గంపేట ప్రజా పాలన ప్రతినిధి. జగ్గంపేట -1 సచివాలయం లో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భం గా "స్పర్శ" కుష్టువ్యాధి అవగాహన కార్యక్రమం జరిగింది .ఈ కార్య క్రమం లో జగ్గంపేట గ్రామ ఉప సర్పంచ్ గౌ శ్రీ బండారు రాజా గారు , గౌ జడ్ పి టి సి సభ్యురాలు శ్రీమతి ఒమ్మి బిందు మాధవి రఘురాం గారు , గౌ ఎం .పి .టి సి . సభ్యులు మరియు వార్డు సభ్యులు , గ్రామ ప్రజలు , మెడికల్ ఆఫీసర్ డా . శ్రీ రా మ్ పాల్గొన్నారు , ఈ సమావేశములో ముందుగా మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు .అనంతరం శ్రీ బండారు రాజా గారు మాట్లాడుచు ఆరోగ్య సిబ్బంది కుష్టువ్యాది పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, కుష్టువ్యాది గ్రస్తులకు అవసరమైన చికిత్స అందించాలని కోరారు .శ్రీ రఘురాం గారు మాట్లడుచు గాంధీ గారు ఆశయాలకు అనుగుణంగా కుష్టువ్యాది గ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి సేవలు అందిస్తూ వారిని సమాజం లో అందరితో పాటు ఆదరించాలని కోరారు. డా . శ్రీ రా మ్ గారు మాట్లాడుచు కుష్టువ్యాది ని ప్రాధమిక దశలో గుర్తించి , చికిత్స అందించడం వలన వ్యాధి పూర్తి గా నయం చెయడ మే కాకుండా అంగవైకల్యం రాకుండా కాపాడ వచ్చని తెలియ జేసారు . శరీరం పై సాధారణ చర్మపు రంగు కంటే కొంచం తక్కువ రంగు లేదా రాగి రంగు ఉన్న స్పర్శ లేని మచ్చలు లేదా నూనె పూసినట్లు గా నిగ నిగ లాడే స్పర్శ లేని చర్మము కుష్టువ్యాది కి సంబందించిన ప్రాధమిక లక్షణములు . ఈ లక్షణములు మచ్చలు ఉన్న వారు ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలి. బహుళ ఔషధ చికిత్స(యం .డి టి )ద్వారా కుష్ఠ వ్యాది ని పూర్తి గా నయం చేయవచ్చని తెలియ జేసారు . కుష్ఠ వ్యాది పట్ల ప్రజలలో అవగాహన పెంచడానికి ,అపోహలు తొలగించడానికి అన్ని గ్రామ సచివాలయాల లో ను ఆరోగ్య సిబ్బంది చే 30-01-2023 నుండి 13-02-2023 వరకు జాతీయ కుష్టు వ్యాది నివారణా పక్షోత్సవ కార్యక్రమములు నిర్వహిస్తామని తెలియ జేసారు. .చివరగా అందరి తో డా . శ్రీ రా మ్ ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమం ఆరోగ్య సిబ్బంది , , సచివాలయ సిబ్బంది అంగన్వాడి కార్యకర్తలు, ఆషా కార్యకర్తలు గ్రామ వాలంటీర్ లు పాల్గొన్నారు.

## బి ఆర్ ఎస్ పార్టీలో చేరిన కంభంపాటి రమేష్




పల్నాడు జిల్లా. నరసరావుపేట. జనవరి 30 ( ప్రజా పాలన ప్రతినిధి. )తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ స్థాపించిన బి.ఆర్.ఎస్ పార్టీలో ఆంధ్రప్రదేశ్ నాయకులు కంభంపాటి రమేష్ పార్టీలో చేరారు.తెలంగాణ రాష్ట్ర ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మరియు బి ఆర్ ఎస్ జాతీయ నాయకులు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో బి అర్ ఎస్ పార్టీలో చేరటం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు మరియు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ స్థాపించిన బి ఆర్ ఎస్ పార్టీలో చేరటం సంతోషంగా ఉందని అన్నారు ఆంధ్రప్రదేశ్ లో బి ఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కు, తెలంగాణ మంత్రి కేటీఆర్ కు, తెలంగాణ రాష్ట్ర ఎంపీ వద్దిరాజు బి ఆర్ఎస్ జాతీయ నాయకులు రమేష్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

## సత్యం అహింసా ఆయుధాలుగా స్వతంత్రాన్ని సాధించిన మహనీయుడు గాంధీ మహాత్ముడు




జగ్గంపేట ప్రజా పాలన ప్రతినిధి.కాకినాడ జిల్లా జగ్గంపేట జనవరి 30: స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 75 వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ సత్యం అహింస ఆయుధాలుగా 200 సంవత్సరాలు బ్రిటీష్ వారి కబంధ హస్తాల మధ్య భారతదేశం నలిగిపోతుంటే స్వతంత్రం సాధించి భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహాత్ముడు గాంధీజీ అని ఆయన 1948 జనవరి 30వ తేదీన కొంతమంది స్వార్థపరుల తుపాకి తూటాలకు బలి అయ్యారని ఆయన ఆశయాలను నెరవేర్చినప్పుడే భారతదేశంలో మరింత ఉన్నత స్థితికి చేరుతుందని ఆ మహాత్ముని సేవలు ప్రతి ఒక్కరు కూడా మననం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట గండేపల్లి మండలాల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కొత్త కొండబాబు, పోట్రు కృష్ణ కుంచే రామకృష్ణ, రాయి సాయి, మండపాక అప్పన్న దొర, సుబ్బయ్యంపేట మాజీ సర్పంచ్ బొండా శీను బాబు, నలమాటి ఆనంద్, బండారు నాని, మంతెన రవిరాజు, బండారు సతీష్, బోండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం



పల్నాడు జిల్లా .నరసరావుపేట. జనవరి 30 (ప్రజాపాలన ప్రతినిధి): నరసరావుపేట జిల్లా కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ అధ్వర్యంలో మహాత్మ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భముగా అలెగ్జాండర్ మాట్లాడుతూ మహాత్మ గాంధీ దేశం కోసం తన ప్రాణాలను అర్పించారు అని వారి నాయకత్వములో దేశానికి స్వాతంత్రం సాధించినారని,నాటి మతోన్మాదుల చేతిలో ప్రాణాలు పోగొట్టుకొని దేశాన్ని ఐక్యము గా వుంచినారని అన్నారు. తదుపరి ఏఐసీసీ ,ఏపీసీసీ ల పిలుపు మేరకు రాహుల్ గాంధీ జోడో యాత్రను కాశ్మీర్ విజయవంతం గా పూర్తి చేసిన దానికి సంఘీ బావము గా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అలనాడు మహాత్మ గాంధీ మతోన్మాదుల తో బ్రిటిష్ వారితో పోరాటం చేసి దేశాన్ని ఐక్యము వుంచగా నేడు రాహుల్ గాంధీ దేశములోని ప్రజలంతా కులమతాలకు ప్రాంత విబేధాలుకు అతీతముగా కలసి మెలసి ఐక్యము జీవించాలి అని భారత్ జోడో యాత్రను చేసి విజ్యవంతముగా పూర్తి చేసి వారు దేశం కోసం ఏ త్యాగానికైనా సిద్ధమేనని సందేశాన్ని ప్రజలకి ఇచ్చారని అన్నారు. ఇంకా యీ కార్యక్రమములో పిసిసి మెంబర్ సీద కృష్ణ ,జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఎస్.సి. సెల్ ఇమ్మాన్యుల్ బీసీ సెల్ పూర్ణచంద్రరావు, రావు,%చీంబఊ% నాగుర్, స్వర్ణ శ్రీను, నటరాజ్,దేవానంద్ , బక్క జయపాల్, సత్యం , తదితరులు పాల్గొనినారు.

## కారుకొండ శ్రీను కుమారుడు మరణం పట్ల పరామర్శ



జగ్గంపేట ప్రజా పాలన ప్రతినిధి :ఇటీవలే గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామ వాస్తవ్యులు కారుకొండ శ్రీను కుమారుడు కారుకొండ విజయ్ హఠాత్తు మరణవార్త తెలిసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,సానుభూతి తెలిపిన వై యస్ ఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు రామచంద్రాపురం పార్టీ పరిశీలకులు ఒమ్మి రఘురామ్ ఆయన వెంట ఎంపీటీసీలు ఆకుల శ్రీధర్, చెరుకూరి జయరాజు, గొల్లపల్లి శ్రీను, పార్టీ నాయకులు నీలపల్లి అప్పారావు, కిలపర్తి వీరబాబు, నేదురి వీరబాబు తదితరులు ఉన్నారు .

## హంసలదీవిలో బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు



కృష్ణాజిల్లా అవని గడ్డ నియోజకవర్గం హంసలదీవిలో జరగనున్న బ్రహ్మోత్సవాలకు సింధు స్నానాలకు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సిహెచ్ సుధాకర్ తెలిపారు.. ఆలయ బందోబస్తు నిమిత్తం కోడూరుమండల ,ఎమ్మార్వో లతీఫ్ పాష ఎంపీవో నాగ రేవతి అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు కోడూరు ఎస్సై రాజేంద్రప్రసాద్ ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కొండలు తదితరులు పాల్గొన్నారు..

## గౌతమి జీవ కారుణ్య సంఘం, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన సివిల్ జడ్జ్ కె. ప్రత్యూష కుమారి..



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రత్యూష కుమారి స్థానిక గౌతమి జీవ కారుణ్య సంఘం మరియు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ముందుగా గౌతమి జీవ కారుణ్య సంఘాన్ని సందర్శించిన న్యాయ మూర్తి అక్కడ వృద్ధులకు గల సదుపాయాలను పరిశీలించారు. వంటశాల, భోజనశాల మరియు వసతి గదులను పరిశీలించారు. అక్కడ అధికారులతో మాట్లాడి వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. వృద్ధులకు ఏ విధమైన సమస్యలున్నా పారా లీగల్ వాలంటీర్ల ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని అన్నారు. తదుపరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన న్యాయమూర్తి సైకియాట్రిక్ విభాగాన్ని పరిశీలించారు. అక్కడి వైద్యులతో మాట్లాడి ఆసుపత్రిలో ఉన్న వైద్య సదుపాయాలు, రోగుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఏ లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని, ఎటువంటి సమస్య ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

## సమాజంలో కుష్ఠువ్యాధి వ్యాధిగ్రస్థుల పట్ల వివక్ష చూపరాదు



మచిలీపట్నం కలెక్టరేట్ : ప్రజాపాలన జనవరి 30: సమాజంలో కుష్ఠువ్యాధి వ్యాధిగ్రస్థులపట్ల వివక్ష చూపకూడదని వారిని జన జీవన స్రవంతిలోకితేవడానికి అన్ని విధాల కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందన నిర్వహించి ప్రజల నుండి అర్జీలుస్వీకరించారు. ఈ నెల 30 నుండి ఫిబ్రవరి 13 వరకు జిల్లాలో కుష్ఠువ్యాధి నివారణ అవగాహనకార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా కలెక్టరు అధికారులతో ప్రతిజ్ఞ చేయించి పోస్టర్లు, కరపత్రాలువిడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంలోభాగంగా జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కుష్ఠువ్యాధి సోకిన వారిపట్ల సమాజంలో వివక్ష ప్రదర్శించకూడదని ఈ మేరకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో రేపే గ్రామదర్శిని నిర్వహిస్తున్నట్లు కలెక్టరు తెలిపారు. గ్రామదర్శిని ప్రత్యేకాధి కారులు,మండల ప్రత్యేకాధికారులు గ్రామాలను సందర్శించి పాఠశాలలు, అంగన్వాడీలు, హాస్టళ్ళు, ఆస్పత్రులుసందర్శించి వాటి పనితీరు పరిశీలించాలన్నారు. గత 3 విడతలుగా జిల్లాలో నిర్వహించినగ్రామదర్శినిలో గుర్తించిన సమస్యలు నూరుశాతం పరిష్కరించాలన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలోగ్రామదర్శిని సమీక్షిస్తామన్నారు. స్పందన అర్జీలుః

ఉయ్యూరు మండలం కాటూరు గ్రామంలో 2015 సంవత్సరంలో నాలుగున్నర ఎకరాలభూమి కొనుగోలు చేశామని, ఇంత వరకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయలేదనిఅర్జీదారు మోకా రామలింగేశ్వర రెడ్డి స్పందనలో అర్జీ సమర్పించారు. ఉయ్యూరు మండలం మానికొండ గ్రామంలో అర్జీదారు అమమోలు సతీష్ కుమార్ తనకుగల 3 ఎకరాల పొలం రెవెన్యూ రికార్డుల్లో విస్తీర్ణంలో తేడాలు సరి చేయాలని కోరారు. ఘంటసాల మండలం మల్లంపల్లి గ్రామ పరిధిలో విశ్వబ్రాహ్మణ పూర్వీకుల స్మశానంవేరేవారు ఆక్రమించి భవనం నిర్మిస్తున్నారని, ఆక్రమణ తొలగించాలని కోరుతూ చోడవరపుభాస్కరరావు స్పందనలో అర్జీ దాఖలు చేశారు. పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామానికి చెందిన పాతూరి సాయిమ్మ తన భర్త విఆర్ ఎగా పని చేస్తు మరణించారని తన భర్తకు రావలసిన బకాయిలు సొమ్ము ఇప్పించాలనికోరుతూ స్పందన అర్జీ సమర్పించారు. గన్నవరం విమానాశ్రయం విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులనుఆదుకోవాలని కోరుతూ పలువురు స్పందనలో తమ అర్జీలు సమర్పించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్, డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ముడావీసీ బి.శివనారాయణ రెడ్డి, డిఎంఅండ్ హెచ్ డా. గీతాబాయి, డిసిహెచ్ఎస్ డా. ఇందిరాదేవి, డిపివోనాగేశ్వరనాయక్, డిఆర్డిఎ పిడి పిఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు



గోకవరం ప్రజా పాలన జనవరి 30 మండల కేంద్రమైన గోకవరం ఎంపీపీ కార్యాలయం నందు మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు గోకవరం ఎంపీడీవో కెవిఎస్ఎస్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు పాల్గొని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలను గూర్చి కొనియాడారు ఆయన ఆశలకు అనుగుణంగా మనం అందరం నడుచుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో గోకవరం మండలం వైసిపి కన్వీనర్ పాటి రాంబాబు ఉచ్చుతాపురం గ్రామ సర్పంచ్ బి శ్రీను ఈవోపీఆర్డి ఎం రాజేశ్వరరావు ఏవో శ్రీనివాస దొర ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# చింతపల్లి గ్రామంలో నాలుగవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం



కారంపూడి... జనవరి30... ప్రజాపాలన... .ప్రతినిధి :మండలంలోని చింతపల్లి గ్రామంలో నిర్వహించిన నాలుగవ రోజు గడపగడప కార్యక్రమంలో మాచర్ల ఎమ్మెల్యే పల్నాడు జిల్లా అభివృద్ధి కమిటీ చైర్మన్ పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి తో పలువురు అవ్వతాతలు అన్నారు. ముందుగా చింతపల్లి చేరుకున్న ఎమ్మెల్యే పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి దేవాలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. అనంతరం గడపగడప కార్యక్రమన్ని నిర్వహించి ప్రతిగడపకు వెళ్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఆయా కుటుంబాలకు అందిన లబ్ధికి సంబంధించి కరపత్రలు అందిస్తూ ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి అని ఆనాడు ప్రజాసంకల్పయాత్ర లో ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలను ప్రవేశపెట్టి ప్రతిఒక్క పేదవాడికి అందిన్నా మహోన్నత ముఖ్యమంత్రిగా నిలిచారాని అయన అన్నారు. ప్రతిఒక్క కుటుంబంలో విద్యకుసుమలు వెళువేత్తలనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడ లేని విధంగా అమ్మఒడి కార్యక్రమన్ని ఏర్పాటు చేసి బడికి వెళ్లిన ప్రతిఒక్క విద్యార్థివిద్యార్థిని తల్లి ఖాతాలో నేరుగా అమ్మఒడి నగదును అందిన్నా అక్కచెల్లమ్మలకు ఒక సోదరునిగా చిన్నారులకు మేనమామలా సేవలు అందిస్తున్నారని అయన అన్నారు. కులాలు, మతలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశవే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అని అయన అన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రతిఒక్క పేదవానికి నేరుగా లబ్దిచేకూరుస్తూ సంక్షేమ సారధిగా ముఖ్యమంత్రి జగన్ నిలుస్తున్నారని నవరత్నాలు పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు చేకూరుతుందని అయన అన్నారు.

గడపగడప కార్యక్రమం సందర్బంగా కారంపూడి సిఐ దార్ల. జయకుమార్, ఆధ్వర్యంలో కారంపూడి ఎస్ఐ ఎం. రామాంజనేయులు పటిష్ట బందోబస్త్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ నాయకులు టౌన్ వీరారెడ్డి, చింతపల్లి వైసీపీ నాయకులు పంగుళూరి. రామకృష్ణయ్య, సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీపి మేకల. శారదశ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ షేక్. షఫీ, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వరరావు, ఎంపీడిఓ శ్రీనివాసరెడ్డి, ఈఓపిఆర్డి సత్యప్రసాద్, యువజన విభాగం అధ్యక్షులు చిలుకూరి. చంద్రశేఖర్ రెడ్డి, పాతూరి. రామిరెడ్డి, చెన్నకేశవ ట్రస్ట్ బోర్డు చైర్మన్ చల్లా. ప్రసాద్, మండల కన్వినర్ కొంగర. సుబ్రహ్మణ్యం, కోమెర. పిచ్చయ్య, కారంపూడి సర్పంచ్ రామావత్. ప్రమీలభాయి తేజానాయక్ , కొమ్ము. చంద్రశేఖర్, సీనియర్ నాయకులు అక్బర్ జానీ భాషా, పంగుళూరి. చినవెంకటనరసయ్య, ఒప్పిచర్ల మాజీ సర్పంచ్ రామాదేని. అంజయ్య, బొమ్మిన. అల్లయ్య, కారాలపాటి. సుబ్బారావు, సురే. సుబ్రహ్మణ్యం, గుండా. శ్రీను, ఉపసర్పంచ్ సురే. అంకారావు, ఒప్పిచర్ల మౌలాలి, మిరియాల వైసీపీ నాయకులు కొమ్మిరెడ్డి. ఎర్రగురువారెడ్డి, గుండెబోయిన. శివ, గాడిపత్రి. పూర్ణయ్య, ఉన్నం. గిరి, చింతపల్లి ఎంపీటీసీ వెంపోగు.నిర్మల, సురే. చెంచారావు, సురే. వెూషే, అమరయ్య, చిరుమామిళ్ల. నరసింహరావు, సురే. వెంకటేశ్వర్లు, అల్లు. వెంకటేశ్వర రెడ్డి, చినకొదమగుండ్ల వీరారెడ్డి, సోషల్ మీడియా కన్వినర్ జక్కిరెడ్డి. నాగిరెడ్డి, గాదెవారిపల్లి సైదారెడ్డి, ఒప్పిచర్ల పాలకీర్తి. నరేంద్ర, వంకాయలపాటి. పిచ్చయ్య, జొన్నలగడ్డ. శ్రీను, మద్రి. శేషయ్య , కాచవరం కిష్టాపాటి. అంకిరెడ్డి, వెన్నపూసల. జగన్ మోహన్ రెడ్డి, ఇనపరాజుపాల్లి కోటిరెడ్డి, సర్పంచ్ శేఖర్, గాదెవారిపల్లి సర్పంచ్ బైరెడ్డి.శ్రీనివాసరెడ్డి, బైరెడ్డి. కోటిరెడ్డి, మహిళ కన్వినర్ మేకపోతు. వెంకటరమణ, పేదకొదమగుండ్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మిరియాల రాజశేఖరరెడ్డి, ఆశం. విజయభాస్కర్ రెడ్డి, చింతపల్లి వైసీపీ నాయకులు అంకారావు, సురే. శ్రీనివాసరావు, ఒప్పిచర్ల సర్పంచ్ ఇరిగిడిండ్ల. లాజర్ చిలుకూరి. రవీంద్రరెడ్డి, దొంత. విరాంజనేయులు, మైనారిటీ నాయకులు మస్తాన్, సెల్ షాప్ కరీమ్, బందర్. బుడేసా, చింతపల్లి సచివాలయ కన్వినర్ లంక. నాగేశ్వరరావు, ఎంపీటీసీ వెంపోగు. నిర్మల, చింతలశ్రీనివాసరావు, కోఆప్షన్ అంతరగడ్డ. ఏసోబు, కారంపూడి ఎంపీటీసీ వేముల. లింగయ్య, చల్లా. అనిల్, పేటనన్నేగండ్ల నరేంద్ర, మరియుదాసు, వివిధ శాఖల అధికారులు మండలంలోని ప్రజాప్రతినిధులు, చింతపల్లి వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్పందనలో 158 అర్జీలు స్వీకరించిన అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ శుక్లా



అమలాపురం జనవరి30 ప్రజాపాలన ప్రతినిధి :ప్రజా ఫిర్యాదుల వేదిక స్పందన కార్యక్ర మంలో అందిన అర్జీలపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి నాణ్యతతో అర్జీలు పరిష్కరించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లా సూచించారు. జిల్లాస్థాయి ప్రజా విజ్ఞాపనల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ స్పందన హాల్లో నిర్వహించారు. స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ హె.ఎం ధ్యానచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, డాక్టర్ బి.ఆర్ అంబేద్క ర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞాపనలను స్వీకరించి ఆయా శాఖల ద్వారా నిర్దిష్ట గడువులో పరిష్కారానికై జిల్లాస్థాయి అధికారులకు ఆదేశాలిచ్చారు. ?కార్యక్రమంలో 158 అర్జీలను స్వీకరించారు. వివిధ సంక్షేమ పథకాలు,కార్యక్రమాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పేదలందరికీ ఇళ్లు కింద ఇళ్ల మంజూరు, రెవెన్యూ సేవలు, సర్వే, సామాజిక భద్రత పింఛను మంజూరు తదితర సమస్యల పై అర్జీలు వచ్చాయ న్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తు నిశి తంగా పరిశీలించి నిబంధనల ప్రకారం తగు పరిష్కార మార్గాలు నిర్దేశిత గడువు లోపల చూపుతూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతతో దరఖాస్తులు పరిష్కరిం చాలన్నారు. ఒకే అంశంపై మరలా మరలా దరఖాస్తులు సమర్పించ కుండా పరిష్కార సరళపై దృష్టి సారించి, గడువు దాటిన అర్జీలు లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తం గా వ్యవహరిస్తూ ప్రతి దరఖాస్తు పరిష్కారానికై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. జిల్లాస్థాయి అధి కారులు తమ క్షేత్రస్థాయి పర్య టనలో భాగంగా తమ పరిధి లోని గ్రామ సచివాలయాలను సందర్శించి మీ మీ శాఖలకు సంబంధించిన పథకాలు ఇతర అంశాలపై సచి వాలయం సిబ్బందికి అవగాహన పెంచడంతోపాటు సచివాలయ పనితీరు మెరుగుపరచడంలోను గ్రామ సచివాలయాలకు అందిన ఆయా శాఖల అర్జీలు పరిష్కారం లోను తోడ్పాటు న%శీ%దించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, డిసిహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, పంచాయతీరాజ్ ఆర్డబ్ల్యూ ఎస్ ఎస్ ఈ లు చంటి బాబు, కృష్ణారెడ్డి, జెడి పశుసంవర్ధక శాఖ డాక్టర్ ఏ జైపాల్ ,జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్వి రవి సాగర్, సీపీఓ వెంకటేశ్వర్లు డిఆర్డిఏ పిడి వి శివశంకర్ ప్రసాద్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ కె తులసి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ పాపారావు, గృహ నిర్మాణ సంస్థ పథక సంచా లకులు సిహెచ్ బాబురావు జిల్లా నీటి యజమాన్య సంస్థ పదక సంచాలకులు ఎస్ మధుసూదన్ జిల్లా ఉద్యాన అధికారి ఎన్ మల్లికార్జునరావు జిల్లా వ్యవసాయ అధికారి కాకి నాగేశ్వరరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జీవి సత్యవాణి, జిల్లా పంచాయతీ అధికారి వి కృష్ణకుమారి, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ అధికారి గోపాలకృష్ణ , విద్యాశాఖ డిఈ సుబ్బరాజు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీప్ కోచ్ సురేష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దుర్గారావు దొర,వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాత్రేనికోన వైస్ ఎంపీపీ సానుబోయిన నాగేశ్వరరావు పై స్పందన లో ఫిర్యాదు


సానబోయిన వారి
పెండ్లిపిలుపు
వెంకట రమణ
అనుశ్రీ
To,
శ్రీయుత శ్రీ
ఆహ్వానించువారు:
శ్రీ సానబోయిన నాగేశ్వర రావు, శ్రీమతి పద్మావతి
Vice MPP, Katrenikona
ఫోన్ : 9493780387, 8143104030

కాత్రేనికోన జనవరి30 ప్రజాపాలన ప్రతినిధి.:మహారాజు శ్రీ గౌరవనీయులైన డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కవెక్టర్ వారి దివ్వసముఖమునకు, మండలానికి చెందిన,మేము వ్రాయించి, ఇస్తున్న దరఖాస్తు విన్నపము.వైసీ ఎంపీపీ ని రాజ్యాంగ బద్దమైన పదవి నిర్వహిస్తున కాత్రేనికోన వైస్ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు %ూ/ ూ% సత్యనారాయణ మహిపాల చెరువులోని గ్రాండ్ పార్క్ నందు 31/1/2003 వ తేదీ సాయంకాలం నాగేశ్వరరావు అతని కుమారుని వివాహ రిసెప్షన్ నిమిత్తం ముద్రింపజేసిన శుభలేములలో కొన్నింటిని ప్రభుత్వం జారీ చేసిన గజిటేడ్ తోను మరియు అపహాస్యం చేస్తూ, రెండవ శుభలేఖ లను తప్పుగా ముద్రింపజేసారు. కొన్నింటిపై డా.జి.ఆర్. అంబేద్కర్ కోనసీమ అని, మరి కొన్నింటిపై కోనసీమ జిల్లా అని ముద్రింపజేసి ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ల్ వ్యతిరేఖించారు. మండలంలో రాజ్యాంగ పదవిని నిర్వహిస్తూ.. రాజ్యాంగాన్ని అవమానిస్తూ ఉదేశపూర్వకంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని వ్యతిరేకించడం ఎంత వరకు సమంజసం?కావున తమరు అతను విషయంపై విచారణ జరిపించి, ప్రభుత్వ గజిటేడ్ ను వ్యతిరేశించిన ఇతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రభుత్వ జి వో ప్రకారం శుభలేఖ లలో అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరును ముద్రించాలని ప్రింటింగ్ ప్రెస్ వాళ్ళందరికీ ఆదేశాలు జారీ చేయలని, తమరిని కోరి ప్రార్థిస్తున్నాము. అని ఈ విధంగా కాత్రేనికోన మండలానికి చెందిన దళిత నాయకులు ఈరోజు సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా కు ఫిర్యాదు చేశారు.

## క్షమాపణలు చెప్పిన పంచాయితీ సెక్రెటరీ టంకాల శ్రీనివాసరావు



గోకవరం ప్రజా పాలన జనవరి 30: రిపబ్లిక్ డే వేడుకల్లో డా.బి.ఆర్. అంబేడ్కర్ ను అవమానించిన సెక్రెటరీ టంకాల శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని దళిత యువకులు పెద్దఎత్తున ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే.కానీ ఎంతకు స్పందించని సెక్రెటరీ దళిత యువకులు రిలే నిరాహారదీక్షలు చేపడతామని హెచ్చరించడంతో, దిగివచ్చి తప్పిదాన్ని ఒప్పుకుని నేడు డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, క్షమాపణలు తెలియజేశారు. సెక్రెటరీ మాట్లాడుతూ అదే రోజు నాలుగైదు కార్యక్రమాలు ఉండటం వలన మా సిబ్బంది చేసిన ఏర్పాట్లను గమనించలేక పోయాను,నా చర్యలవల్ల దళిత యువకులు మనస్తాపం చెందారని తెలిసి, ఈ రోజు డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి క్షమాపణలు కోరానని భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటానని,అంబేద్కర్ చలువ వల్ల నేను ఎంతో లబ్ది పొందినవాడినే అని మాట్లాడారు. సెక్రెటరీ తీసుకున్న నివృత్తి కార్యక్రమం పట్ల ధర్నాలో పాల్గొన్న జక్కల బాపిరాజు,ఈది అశోక్,మోటపర్తి ఆనంద్,మెప్పెల్లి జయరాజు,కంచుమర్తి రాజశేఖర్,ఏలేటి పండు,ఇజ్జిన ప్రసాద్ కుమార్, మోర్త చిట్టిబాబు, ఇజ్జిన కిరణ్ కుమార్ , బంటుమెల్లి ధర్మేంద్ర,వడ్లపాటి పవన్,బరగటి రాజు,కొండ శ్రీను,కొంగరపు రాజు,నేతల నరేంద్ర,బూసి అర్జునుడు,కోట వీరబాబు, కందికట్ల కమల్ కుమార్,పినిపే అభి, కొల్లపు చంటి,దినకర్,పెరువలి శ్యామ్,గంతే సుజిరాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## వేలాది మంది కి రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహిచిన రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ సంస్థ.



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జనవరి 30 (ప్రజా పాలన ప్రతినిధి): పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట లో గోపిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో ఒంగోలు జాతి వృషభరాజముల బండ లాగుడు బల ప్రదర్శన స్థానిక డి.ఎస్.ఎ స్టేడియంలో గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ముగిసినది. జాతి వృషభరాజుముల బండ లాగుడు బల ప్రదర్శన కార్యక్రమంలో 8 రోజూ పాటు ఉమ్మడి ఆంధ్రా రాష్ట్రాల పలు జిల్లాలో నుంచి 129 జతలు పాల్గొనడం జరిగింది, ఈ సందర్భంగా సుమారు ఇరవై స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ లో "రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ" వారు ఇక్కడికి వచ్చే వాహనదారుల్లో రోడ్డు భద్రత పై అవగాహన కోసవే వారికి"వర్కుషాప్"ద్వారా వివరించి వారికి కరపత్రాలు, రోడ్డు సిగ్నల్ ఛార్ట్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ అధ్యక్షులు ఆర్. కె. దుర్గ పద్మజ మాట్లాడుతూ మేము ఇక్కడికి వచ్చే వేలాదిమంది వాహన వాడకం దారుల్లో హెల్మెట్,సీట్ బెల్టు గురించి, మద్యం సేవించి వాహనాలు నడపరాదు అని అనేక రోడ్డు భద్రతా సూచనలతో కూడిన కరపత్రాలు ఉచితంగా రిఫ్లెక్టర్ టేపు అందజేసాము అని, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సూచన మేరకే "స్వచ్చతా పక్వడా-2023 గురించి వివరించాము అని ప్రతిరోజు రెండు వెలమందికి తక్కువ కాకుండానే ఎనిమిది రోజులు సుమారు గా పదహారు వెలమందికి రోడ్డు భద్రత పై అవగాహన కలిపించాము అని మాయొక్క స్టాల్ ని పల్నాడు జిల్లా పోలీసు అధికారి రవిశంకర్ రెడ్డి చేతులు మీదుగా శాసనసభ సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గారిప్రోత్సాహం తో ప్రారంభించుకోవడం జరిగింది అని,మాకు ప్రతి సంవత్సరం ఈ అవకాశం ఇచ్చే నిర్వాహకుల కు ధన్యవాదాలు తెలిపారు.

## టైగర్ పని పూర్తి చేసిన రేణు దేశాయ్..



రేణూ దేశాయ్... రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియని వారుండరు అంటే అతిశయోక్తి కాదు. ఈమె వెండితెరపై కనిపించక చాలా ఏళ్లు గడుస్తున్నా ప్రేక్షకులు మాత్రం ఆమెను ఇప్పటికీ మరిచిపోలేరు. చివరగా పవన్ కల్యాణ్ తో కలిసి జానీ సినిమాలో నటించిన ఈమె.. మళ్లీ సినిమాల్లో కనిపించలేదు. పవన్ కల్యాణ్ తో పెళ్లి పిల్లలతో బిజీగా గడిపింది. పవర్ స్టార్ తో విడాకులు తీసుకున్న తర్వాత ఓ సినిమాను డైరెక్ట్ చేయాలని చాలానే కలలు కంది. కానీ పలు కారణాల వల్ల అది అలాగే ఆగిపోయింది. అప్పుడప్పుడూ పలు టీవీ షోలు వెబ్ సిరీస్ లలో కనిపిస్తున్న రేణూ దేశాయ్... ఆద్య అనే వెబ్ సిరీస్ ను కూడా ప్రారంభించింది. కానీ అది మధ్యలోనే ఆగిపోయినట్లు తెలుస్తోంది. కరోనా వల్ల మరింత ఆలస్యం అవుతుండటంతో మధ్యలోనే అటకెక్కినట్లు కనిపిస్తోంది. అయితే ప్రస్తుతం రేణూ దేశాయ్... రవితేజ టైగర్ నాగేశ్వర రావు సినిమాలో నటిస్తుందనే విషయం అందరికీ తెలిసిందే. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే రేణూ దేశాయ్ తాజాగా టైగర్ నాగేశ్వర రావు సినిమాకు సంబంధించి ఓ పోస్ట్ పెట్టింది. రవితేజ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో హేమలతా లవణం అనే పాత్రలో రేణూ దేశాయ్ కనిపించబోతున్నట్లు సమాచారం. అయితే ఇప్పుడు ఈ పాత్రకు సంబంధించిన షూటింగ్ అయిపోయినట్టుగా రేణూ దేశాయ్ తెలిపింది. ఇంత మంచి పాత్ర ఇచ్చినందుకు పవర్ ఫుల్ రోల్ ఇచ్చినందుకు డైరెక్టర్ వంశీ కృష్ణకు థాంక్స్ చెప్పింది. అభిషేక్ అగర్వాల్ వారి వల్లే ఈ యూనిట్ అంతా కూడా తనకు ఫ్యామిలీలా మారిందని రాసుకొచ్చింది. ఎంతో కంఫర్ట్ గా పని చేశానని వివరించింది. తన పాత్రకు సంబంధించిన షూటింగ్ జరిగే ప్రతీ క్షణం నేను ఎంజాయ్ చేశానంటూ ఇన్ స్టా వేదికగా వెల్లడించింది. అయితే రేణూ దేశాయ్ అభిమానులతో పంచుకున్న ఈ పోస్టులో ఎక్కడా హీరో రవితేజ పేరు ప్రస్తావించలేదు.

## మన జక్కన్నపై బాలీవుడ్ డైరెక్టర్ ఆశ్చర్యకర వ్యాఖ్యలు



టాలీవుడ్ జక్కన్న రాజమౌళి పేరు ఈ మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా మారు మ్రోగుతూనే ఉంది. అంతర్జాతీయ స్థాయి మీడియా సంస్థలు గత కొన్నాళ్లుగా ఆర్ఆర్ఆర్ సినిమాపై పెద్ద ఎత్తున కథనాలు ఇస్తూనే ఉన్నాయి. తాజాగా ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు పాట ఆస్కార్ అవార్డ్ కి నామినేట్ అవ్వడంతో మరింతగా జక్కన్న యొక్క పేరు మారు మ్రోగుతోంది అనడంలో సందేహం లేదు. ఎంతో మంది ప్రముఖ ఫిల్మ్ మేకర్స్ కూడా జక్కన్న రాజమౌళి పై ప్రశంసలు కురిపించడం జరుగుతోంది. బాలీవుడ్ లోనే దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్. ఇండియాలోనే గొప్ప దర్శకుల్లో ఆయన ఒకడు. ఆయన తీసిన సినిమాలో ఒక అద్భుతం అన్నట్లుగా ఆయన అభిమానులు అంటూ ఉంటారు. అలాంటి అనురాగ్ కశ్యప్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో జక్కన్న ను ఆకాశానికి ఎత్తేల వ్యాఖ్యలు చేశాడు. రాజమౌళి మన ఇండియన్ సినిమాలను హాలీవుడ్ వారికి కూడా నచ్చే విధంగా తీశాడు. అది కూడా తక్కువ బడ్జెట్ లో హాలీవుడ్ వారికి నచ్చే విధంగా సినిమాలు తీసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందుకే ఇండియన్ సినిమాలు అంటే ఇప్పుడు హాలీవుడ్ వారికి చాలా ఆసక్తి క్రియేట్ అయ్యిందని అనురాగ్ కశ్యప్ పేర్కొన్నాడు. ఇకపై హాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ తమ సినిమాల యొక్క మేకింగ్ కోసం తప్పనిసరిగా రాజమౌళిని సంప్రదిస్తారు అని తాను భావిస్తున్నాను అన్నట్లుగా కూడా పేర్కొన్నాడు. రాజమౌళి మార్వెల్ మరియు డీసీ సినిమాలను తీయగల సమర్థుడు అంటూ ఆశ్చర్యకర వ్యాఖ్యలను అనురాగ్ కశ్యప్ చేయడం జరిగింది. రాజమౌళి యొక్క స్టామినా ఏంటో అనురాగ్ కశ్యప్ యొక్క వ్యాఖ్యలను చూస్తే అర్థం అవుతోంది.

## సంక్రాంతి బరిలో వెంకీ పాన్ ఇండియా మూవీ




స్టార్ హీరో వెంకటేష్ గతేడాది ఎఫ్3 సినిమాతో సూపర్ సక్సెస్ అందుకున్నారు. ఈ చిత్రం తర్వాత ఆయన తదుపరి ప్రాజెక్టు గురించి ఇటీవల ప్రకటించాడు. ఇటీవలే హిట్ 2 సినిమాతో సూపర్ సక్సెస్ అందుకున్న సైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేష్ ఓ సినిమా చేయబోతున్న విషయాన్ని వెల్లడించారు. హిట్ సిరీస్తో గుర్తింపు తెచ్చుకున్న సైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేష్ చేయబోయే సినిమాకు సైంధవ్ అనే టైటిల్ను ఖరారు చేశారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ గ్లింప్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో వెంకీ లుక్ కు అభిమానులు ఫిదా అవుతున్నారు. ఇక ఈ సినిమా నుంచి ఓ విషయం బయటకు వచ్చింది. సినిమా వర్గాల సమాచారం మేరకు.. ఈ సినిమా సంక్రాంతి బరిలో ఉంటుందని తెలుస్తోంది. ఈ ఏడాది సంక్రాంతి వార్ లో బాలయ్య చిరు పోటీ పడ్డారు. బాలయ్య వీర సింహా రెడ్డి గా వస్తే... చిరు వాల్తేరు వీరయ్య గా వచ్చి ఇద్దరు హిట్ కొట్టారు. ఇక విజయ్ వారసుడు గా అజిత్ తెగింపు గా వచ్చి పర్వాలేదని పించరు. ఇక నెక్ట్స్ సంక్రాంతి బరిలో బాలయ్య 108 ఉంటుందని తెలుస్తోంది. బాలయ్య 108 సినిమా అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఇదే బరిలో చెర్రీ బన్నీ కూడా నిలిచే అవకాశం ఉంది. చరణ్ %తీఎ%15 బన్నీ పుష్ప 2 సినిమాలు కూడా సంక్రాంతి బరిలో ఉన్నట్లు సమాచారం. ఇక వీరితో సైందవ్ గా వెంకీ పోటీ పడితే ... ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ సినిమాను నిహారిక ఎంటర్టైన్ మెంట్ పై వెంకట్ బోయినపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది వెంకటేష్ నటించబోయే 75వ సినిమా కావడం విశేషం. యాక్షన్ థ్రిల్లర్గా ఈ సినిమాకు సైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్ లో తెలుగుతో పాటు హిందీ తమిళం కన్నడ మలయాళ భాషల్లో ఇది రానుంది. ఈ చిత్రానికి సంతోష్ నారాయణ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. త్వరలోనే రెగ్యూలర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇక వెంకీ రానా తో కలిసి రానా నాయుడు అనే వెబ్ సిరీస్ లో నటిస్తున్నారు.

## 'పుష్ప 2'.. ఇంటర్వెల్ బ్యాంగ్ ఫ్యాన్స్ కి కేకలేనటగా!



'పుష్ప ది రైజ్' మూవీతో టాలీవుడ్ క్రేజీ స్టార్ హీరో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా వైడ్ గా పాపులారిటీని దక్కించుకున్నాడు. స్టార్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో మైత్రీమూవీ మేకర్స్ వారు అత్యంత భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా నిర్మించిన ఈ సినిమా వరల్డ్ వైడ్ గా భారీ విజయాన్ని దక్కించుకుంది. ఉత్తరాదిలో ఊహకందని విధంగా వసూళ్ల వర్షం కురిపించి బాలీవుడ్ ట్రేడ్ వర్గాలని విస్మయానికి గురిచేసింది. దీంతో 'పుష్ప 2'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా పై వున్న క్రేజ్ ని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు సుకుమార్ ఈ మూవీని అత్యంత భారీ స్తాయిలో ఎవరూ ఊహించని విధంగా తెరపైకి తీసుకొస్తున్నారు. పార్ట్ 1 లో డైలీ కూలీ తన యాటిట్యూడ్ తో తెగింపుతో సిండికేట్ స్మగ్లర్ గా ఎదిగిన క్రమాన్ని చూపించగా.. 'పుష్ప 2'లో మాత్రం ఆ సిండికేట్ ని ఏలే వ్యక్తి వరల్డ్ వైడ్ గా మోస్ట్ వాంటెడ్ రెడ్ సాండల్ సామ్రాజ్యానికి డాన్ గా అవతరించిన క్రమాన్ని దేశ విదేశాల్లో నెట్ వర్క్ ని క్రియేట్ చేసుకున్న క్రమాన్ని చూపించబోతున్నారట. ఇదిలా వుంటే ఇటీవల అదిగో ఇదిగో అంటూ సాగదీస్తున్న ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ఇటీవల వైజాగ్ లో మొదలైంది. అక్కడ భారీ స్థాయిలో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సాంగ్ తెరకెక్కించారట. సినిమాకు ఇది ప్రత్యేక హైలైట్ గా నిలుస్తుందని ఇన్ సైడ్ టాక్. ఇదిలా వుంటే ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్న ఈ మూవీ గురించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త హల్ చల్ చేస్తోంది. ఫస్ట్ పార్ట్ ట్రెమండస్ హిట్ గా నిలవడంతో సుకుమార్ పార్ట్ 2 ని ప్రత్యేక హంగులతో ట్విస్ట్ లతో తెరపైకి తీసుకొస్తున్నారట. ఇందులో భాగంగానే ఈ మూవీలోని ఇంటర్వెల్ బ్యాంగ్ అభిమానులతో పాటు ప్రేక్షకులని సర్ ప్రైజ్ చేస్తుందని ఓ వార్త నెట్టింట వైరల్ గా మారింది. విషయం ఏంటంటే సినిమాలో బన్నీ రెడ్ సాండల్ స్లగ్గర్ గా కనిపించనున్న విషయం తెలిసిందే. అయితే కూలి కాస్త సిండికేట్ పగ్గాలని దక్కించుకునే వ్యక్తిగా పార్ట్ 1 లో చూపించిన సుకుమార్ పార్ట్ 2లో మాత్రం బన్నీని రెడ్ సాండల్ స్మగ్లింగ్ ని దేవ విదేశాల్లో విస్తరించే డాన్ గా చూపించబోతున్నాడట. ఇంటర్వెల్ బ్యాంగ్ లో అన్ని ఈ లుక్ లో కనిపించి కేకల్ పెట్టించనున్నాడని ఈ సీన్ సినిమాకు ప్రధాన హైలైట్ గా నిలవనుందని ఇన్ సైడ్ టాక్. అంతే కాకుండా సినిమాలో పార్ట్ 1 కు మించిన స్థాయిలో కొత్త పాత్రలు వుంటాయని ఇవి సినిమాకు హైలైట్ గా నిలుస్తాయని తెలుస్తోంది. ఈ మూవీ విషయంలో సుకుమార్ భారీ ప్లాన్ తో ముందుకు వెళుతున్నాడని సినిమాని ఎవరూ ఊహించని స్టాండర్డ్స్ లో తెరపైకి తీసుకురాబోతున్నాడని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. కీలక పాత్రల్లో ఫహద్ ఫాజిల్ అనసూయ సునీల్ తదితరులు నటిస్తున్నారు. భారీ అంచనాలు నెలకొన్న ఈ మూవీని 2024 జనవరికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు.

## రాజా డీలక్స్ లో నటిస్తున్నట్లుగా చెప్పకనే చెప్పేసింది



ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా గురించి ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటన రాలేదు. ఆ సినిమా షూటింగ్ విషయంలో అనేక రకాల పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఆ మధ్య ఒక షెడ్యూల్ పూర్తి అయ్యింది. మరో షెడ్యూల్ కు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా సమాచారం అందుతోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో ఈ సినిమా రూపొందుతున్నట్లుగా సమాచారం అందుతోంది. ఇక ఈ సినిమా లో ప్రభాస్ కు జోడీగా ముగ్గురు ముద్దుగుమ్మలు నటించబోతున్నారని చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. ముగ్గురు ముద్దుగుమ్మల్లో మాస్టర్ బ్యూటీ మాళవిక మోహనన్ ఒకరు అని కూడా ప్రచారం జరుగుతోంది. ఇన్నాళ్లు కూడా సినిమా గురించే అఫిషియల్ గా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఇక హీరోయిన్ విషయం క్లారిటీ లేనేలేదు. తాజాగా మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పింది. ఆ సందర్భంగా తెలుగు సినిమా గురించి స్పందించింది. మాళవిక మోహనన్ ఒక అభిమాని తెలుగు సినిమా ఎంట్రీ ఎప్పుడు అంటూ ప్రశ్నించగా ఆమె స్పందిస్తూ.. తెలుగు సినిమాకు సంబంధించిన వర్క్ జరుగుతోంది. తప్పకుండా త్వరలోనే ఆ సినిమాను గురించి అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి అన్నట్లుగా చెప్పుకొచ్చింది. ఈ అమ్మడు ప్రభాస్ సినిమాలో కాకుండా మరే సినిమాలో నటిస్తున్నట్లుగా వార్తలు రాలేదు. కనుక తాను తెలుగు సినిమాలో నటిస్తున్నాను అంటూ చెప్పింది కనుక అది ప్రభాస్.. మారుతి సినిమా అయ్యి ఉంటుంది అంటూ చాలా మంది భావిస్తున్నారు. రాజా డీలక్స్ టైటిల్ ను పరిశీలిస్తున్నట్లుగా వార్తలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అప్డేట్ అధికారికంగా రాలేదు.

## దిల్ రాజ్ మాస్టర్ ప్లాన్... ఈ సారి రజనీకాంత్ పై ఫోకస్



డిస్ట్రిబ్యూటర్గా ప్రస్థానం మొదలుపెట్టిన దిల్ రాజు.. ప్రస్తుతం టాప్ మోస్ట్ ప్రొడ్యూసర్గా కొనసాగుతున్నారు. నిర్మాతగా ఎన్ని విజయాలు సాధించినా డిస్ట్రిబ్యూషన్ను మాత్రం వదిలిపెట్టలేదు. ముఖ్యంగా నైజాం వైజాగ్ ఏరియాల్లో థియేటర్లపై ఆయనకు మంచి పట్టు ఉందనే చెప్పవచ్చు. దీంతో చాలా సినిమాల రిలీజ్లను శాసించే స్థాయిలో ఉన్నారు దిల్ రాజు. ఇలా టాలీవుడ్లో సాఫీగా జర్నీ సాగిస్తున్న ఆయనకు ఈ సంక్రాంతి ఫలితాలు మింగుడుపడటం లేదనే చెప్పవచ్చు. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్తో ఆయన నిర్మించిన 'వారసుడు' చిత్రాన్ని తెలుగులో విడుదల చేశాడు. వారసుడు చిత్రాన్ని జనవరి 14న విడుదల చేయగా.. తెలుగులో బాక్స్ ఆఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఎందుకంటే చిరంజీవి 'వాల్తేర్ వీరయ్య'తో పాటు బాలకృష్ణ 'వీరసింహా రెడ్డి' చిత్రాలు ఉండటమే అందుకు కారణం. కానీ తమిళనాడులో మాత్రం కలెక్షన్లు బాగానే రాబట్టింది. అయితే ఈ సంక్రాంతికి తన అంచనా తప్పయిందని రియలైజ్ అయిన దిల్ రాజు.. ఈ విషయంలో తప్పు ఎక్కడ జరిగిందో విశ్లేషించే పనిలో పడ్డారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే దిల్ రాజు తాజాగా మరో తమిళ స్టార్ పై ఫోకస్ చేస్తున్నట్లు సమాచారం. వారీసు చిత్రంతో తమిళ నిర్మాతగా తమిళనాడులో ఎంటర్ అయ్యారు. ఇప్పుడు మరో స్టార్ హీరో పై దృష్టి పెడుతున్నారు. ఆయన ఎవరో కాదు సూపర్ స్టార్ రజనీకాంత్. ఈ హీరో నటిస్తున్న తాజా చిత్రం జైలర్. ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో డిస్ట్రిబ్యూషన్ రైట్స్ ను దిల్ రాజు కొనడానికి ప్రయత్నిస్తున్నారు అని తెలుస్తోంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ టాలీవుడ్ యాక్టర్ సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే జైలర్ సెట్స్ నుంచి విడుదలైన మోహన్ లాల్ సునీల్ స్టిల్స్ నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రంలో మిల్కీ బ్యూటీ తమన్నా బాటియా మరో కీ రోల్ చేస్తోంది. జైలర్ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్పై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 11న రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక ఇదే ఆగస్ట్ 11న %ూవీడీ% 28 సినిమా రిలీజ్ అవుతున్నట్లు తెలుస్తోంది. మహేష్ త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న ఈ చిత్రాన్ని నాగవంశి నిర్మిస్తున్నారు.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com